

రేపల్లె మున్సిపల్‌హైస్కూల్లో పనిచేయని ఆర్‌వోప్లాంటు

బెల్ సరే.. మరి నీళ్లెలా?

విద్యార్థులకు అందని శుద్ధ జలం



- బాపట్ల మండలం మరుప్రోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో వాటర్‌ప్లాంట్ పనిచేయకపోవడంతో ఉపాధ్యాయులు క్యాన్ వాటర్ కొనుగోలు చేసి విద్యార్థులకు అందజేస్తున్నారు పిట్టలవానిపాలెం మండలం చందోలు హైస్కూల్, భవనవారిపాలెంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో వాటర్‌ప్లాంట్లు పనిచేయడంలేదు.
- రేపల్లెలోని పాతపట్నంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో, 2వవార్డులోని గురుకుల పాఠశాలలో, ఓపెన్ థియేటర్‌లోని పాఠశాల, ఆంధ్రరత్న పాఠశాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఉన్నత పాఠశాలలో ఆర్వో ప్లాంట్లు నిరుపయోగంగా ఉన్నాయి.
- వేమూరు నియోజకవర్గ పరిధిలోని 73 పాఠశాలల్లో నాడు-నేడు మొదటి దశలో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. వాటిలో కొన్ని ప్రారంభం నుంచే మరమ్మతులకు గురై పనిచేయడంలేదు. కొంత కాలం తర్వాత మరో 42 ప్లాంట్లు మరమ్మతులతో నిరుప యోగంగా మారాయి.
- అద్దంకి నియోజకవర్గంలో గతంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లలో 90 శాతానికి పైగా మూలనపడ్డాయి. తాజాగా ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో మరమ్మతులు ప్రారంభించారు.



వేమూరు హైస్కూల్‌లో పని చేయని ఆర్వో ప్లాంటు

ఎండలు మండుతున్నాయి.. ఒంటిపూట బడులు ప్రారంభమయ్యాయి. అయినా విద్యార్థులు ఎండ వేడికి అల్లాడుతున్నారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా పాఠశా లల్లో 'వాటర్ బెల్' అమలు చేయాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశించింది. వేసవి తాపానికి గురికాకుండా విద్యార్థులకు గంటకో సారి మంచినీరు తాగేలా చూడా ల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని ఆదేశిం చింది. అయితే వాటర్ బెల్ కొట్టినా విద్యార్థు లకు శుద్ధ జలం ఎలా అందించాలో తెలి యక ఉపాధ్యాయులు తల పట్టుకుంటు న్నారు. అనేక ప్రభుత్వ పాఠశాలల్లో వందల్లో విద్యా ర్థులు ఉన్నా శుద్ధ జలం అందుబాటులో లేదం టే ఆశ్చర్యం కాదు. ఇక గత వైసీపీ ప్రభుత్వం నాడు నేడు పథకంలో రూ.లక్షలు వెచ్చించి ఆర్వో ప్లాంట్లు మంజూరు చేసినా నిర్వహణ లేక అవి నిరుపయోగంగా మారా యి. చాలాదగ్గర్ల వాటిని ఇప్పటికీ బిగించ లేదు. ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో మరమ్మ తులతో మూలకు చేరాయి. దీంతో విద్యార్థు లు ఇళ్ల నుంచి లేదంటే పాఠశాల సమీపం లోనే నీటిని కొనుగోలు చేసి దాహం తీర్చుకుంటున్నారు.

- పాఠశాలల్లో అలంకార ప్రాయంగా ఆర్వో ప్లాంట్లు
- రూ.లక్షలతో ఏర్పాటు.. నిర్వహణ లేక నిరుపయోగం
- కొన్ని పాఠశాలల్లో ఇప్పటికీ యంత్రాలను బిగించని వైనం
- మరమ్మతులపై ఫిర్యాదులను పట్టించుకోని ఏజన్సీలు

ఆంధ్రజ్యోతి ఫోకస్

నిర్వహణ.. నిర్లక్ష్యం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అయితే వాటిని చాలాదగ్గర్ల బిగించలేదు. బిగించిన దగ్గర్ల మరమ్మతులకు గురైనా పట్టించుకునే వారేలేరు. ఏర్పాటుతో సరిపెట్టిన కంపెనీల ప్రతినిధులు నిర్వహణ మరిచారు. ప్రధానోపాధ్యాయులు మరమ్మతుల సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించినా ప్లాంట్ల గురించి పట్టించుకునే వారే లేరు. ప్లాంట్‌లు బిగించిన వారికి ఫోన్ చేస్తే మొక్కుబడిగా మరమ్మతులు చేసి వెళ్తున్నారే కానీ శాశ్వత పరిష్కారం చూపడంలేదు. దీంతో ఆర్వో ప్లాంట్లు ఆయా పాఠశాలలో మూలనపడి నిరుపయోగంగా ఉన్నాయి. స్కూల్ గ్రాంట్‌తో మరమ్మతులకు ప్రధానోపాధ్యాయులు సిద్ధమైనా ఆర్వోప్లాంట్ విడి పరికరాలు ఎక్కడా దొరడంలేదు. దీంతో ప్లాంట్‌ను పాఠశాలకు పంపిణీచేసిన ఏజన్సీ వారు వస్తే తప్ప వాటి మనుగడ కొనసాగలేని పరిస్థితి.

(ఆంధ్రజ్యోతి - బాపట్ల న్యూస్‌నెట్‌వర్క్)

ఎండలతో పాటు వాతావరణంలో వేడి రోజు రోజుకు తీవ్రమవుతోంది. దీంతో పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా గంటగంటకు నీరు తాగేలా చూడాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఇప్పటికే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని పలు పాఠశాలల్లో తాగునీటి వనరులు అందుబాటులో లేవు. ఇళ్ల నుంచి తెచ్చుకుంటేనే తాగునీరు అన్న పరిస్థితి ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు - నేడు పథకంలో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అయితే అవి మూణ్నాళ్ల ముచ్చటగానే పని చేశాయి. ఏర్పాటు చేసిన కొన్ని రోజులకే ఆర్వో ప్లాంట్లు మూలనపడ్డాయి. వాటి మరమ్మతుల గురించి పట్టించుకునే వారే లేరు. అటు ఇటు అధికారులు, ఇటు సంబంధిత ఏజన్సీల వారు ఆర్వో ప్లాంట్ల గురించి పట్టించుకోవడంలేదు.

దీంతో పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రూ.లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు నిర్వహణ సక్రమంగా లేక మూతపడ్డాయి. ఈ పరిస్థితుల్లో పాఠశాలల్లో దొరికే నీరు శుభ్రంగా లేకపోవడంతో (మిగతా 6వ పేజీలో)

బిల్లులు.. బాధలు

- అప్పుల భారంతో కాంట్రాక్టర్లు సతమతం
- గతంలోనూ ఇప్పుడూ ఒకే తీరుగా అధికారులు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.800 కోట్ల బకాయిలు
- బ్యాంకు ఖాతాలకు మార్చి 31 డెడ్‌లైన్.. ఆలోగా చెల్లించకపోతే ఎన్‌పీఏ

గుంటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో కాంట్రాక్టులు చేసిన నేరానికి చిన్నా చితక కాంట్రాక్టర్ల జీవితాలు చిన్నాభిన్నమైపోతున్నాయి. గత ప్రభుత్వం చేసిన పాపాలను కడిగేస్తున్న కూటమి ప్రభుత్వమే న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి (ఎంఎస్ఎంఈ) కేటగిరి కాంట్రాక్టర్లు సుమారు 450 మంది గత ప్రభుత్వ హయాంలో వివిధ శాఖలకు సంబంధించి కాంట్రాక్టులు చేశారు. గుంటూరు, మంగళగిరి- తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ సహా జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో కాంట్రాక్టులు చేసిన వీరికి గత ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో చేసిన పనలకు సంబంధించి రూ.150- 200 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో చేసిన పనులకు సంబంధించి రూ.50-70 కోట్లు, గ్రామీణ నీటి సరఫరా(ఆర్‌డబ్ల్యూఎస్) విభాగంలో రూ.100- 150 కోట్లు బకాయిలు ఉన్నాయి. పంచాయతీరాజ్ పరిధిలో చేసిన పనులకు రూ.70 కోట్ల వరకు బకాయిలు ఉండగా, ఎంజీఎన్‌ఆర్ ఈజీఎస్ పనులకు సంబంధించి రూ.10 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఇవే కాకుండా కొవిడ్ సమయంలో ఆర్ అండ్ బీ పరిధిలో పలు చోట్ల పీహెచ్‌సీల నిర్మాణం, పాత వాటి ఆధునికీకరణలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా రూ.160 కోట్లు ఉండగా, ఒక్క గుంటూరు జిల్లాలోనే రూ.35 కోట్ల బకాయిలు ఉన్నాయి.

● నిధులివ్వని గత ప్రభుత్వం

గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఒక్కసారి కూడా నిధులు ఇవ్వలేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ఒకవేళ ఇచ్చినా మొత్తం కాంట్రాక్టు ఖర్చులో 15 శాతానికి మించి ఇవ్వలేదని చెబుతున్నారు. అది కూడా సీరియల్ ప్రకారం కాకుండా అయిన వారికే ఇచ్చుకున్నారని వాపోతున్నారు. గత ప్రభు త్వం తెరమీదకు తెచ్చిన ఈ అడ్డదారినే ఈ ప్రభు త్వంలో కూడా అధికారులు కొనసాగిస్తున్నారని, దీంతో సామాన్య కాంట్రాక్టర్లు నష్టపోతున్నారని తెలిపారు. సీరియల్‌ప్రకారం కాంట్రాక్టర్ల బకాయిలు చెల్లించాలని కోరుతున్నారు.

● బ్యాంకుల నుంచి నోటీసులు

కాంట్రాక్టర్లు అనేక మంది బ్యాంకుల వద్ద ఓవర్ డ్రాఫ్ట్ రూపంలో అప్పులు చేస్తారు. వాటికి ఏ ఏడాదికా ఏడాది వడ్డీలు చెల్లించాల్సి ఉంటుంది. గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు ఎవరూ వడ్డీలు చెల్లించలేదు. మరో మూడు రోజుల్లో ఈ ఆర్థిక సంవత్సరం కూడా ముగుస్తుండడంతో వడ్డీలు చెల్లించని కాంట్రాక్టర్ల కు బ్యాంకులు నోటీసులు జారీ చేశాయి. మూడు రోజుల్లోపు వడ్డీలు చెల్లించకపోతే సదరు ఖాతాలను నాన్ పెర్ఫార్మింగ్ అసెట్స్(ఎన్‌పీఏ) జాబితాలోకి చేరుస్తామని నోటీసుల్లో హెచ్చరించాయి. ఒకసారి ఖాతా ఎన్‌పీఏ పరిధిలో పెడితే సంబంధిత కాంట్రాక్టరు స్థిర, చర ఆస్తులు వేలానికి వెళతాయని, ఆ ప్రమాదం నుంచి కాపాడమని కాంట్రాక్టర్లు వేడుకుంటున్నారు.

న్యాయం చేయాలి

ఎంఎస్ఎంఈ కాంట్రాక్టర్లకు ప్రభుత్వం న్యాయం చేయాలి. చిన్న, సన్నకారు కాంట్రాక్టర్లు బిల్లులు రాక అప్పులపాలయ్యారు. ఇప్పటికే రాష్ట్రంలో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. అనేక మంది పరిస్థితి అలానే ఉంది. తమను ప్రభుత్వమే ఆదుకోవాలి. సీరియల్ ప్రకారం అందరికీ బకాయిలు చెల్లించాలి.

- ఎస్.విజయ్‌కుమార్, సబ్కా రాష్ట్ర అధ్యక్షుడు



వరించిన పదవులు

- 3 జిల్లాలు.. ఐదుగురికి అవకాశం
- మార్కెట్ కమిటీలకు చైర్మన్ల నియామకం
- మిగతా ఏఎంసీలకు ఉగాదికి నియమించే అవకాశం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఉగాదిలోగా నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికే ప్రకటించగా.. ఆయా పదవులు ఎవరిని వరిస్తాయోనని నేతలు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం పలు మార్కెట్‌యార్డు చైర్మన్ పదవులను ప్రకటించారు. ఇందులో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు సంబంధించి ఐదు మార్కెట్ యార్డులు ఉండగా ఐదుగురిని ఏఎంసీ చైర్మన్ పదవులు వరించాయి. దీంతో నామినేటెడ్ పదవుల భర్తీ కార్యక్రమానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారని కూటమి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఆయా యార్డులకు సంబంధించిన డైరెక్టర్లను త్వరలో నియమించనున్నారు. కాగా శుక్రవారం ప్రకటించిన చైర్మన్ పదవుల నియామకంపై స్థానిక కేడర్‌లో హర్షం వ్యక్తమవుతోంది. పార్టీ కోసం అహరహం శ్రమించిన వారికే పదవులు కట్టబెట్టారని కొనియాడుతున్నారు.

ఆశావహుల ఎదురుచూపు..

మార్కెట్ పాలక వర్గాలకు సంబంధించి మరికొందరికి డైరెక్టర్ పదవులు దక్కనున్నాయి. యార్డులకు సంబంధించి ఇప్పటికే రిజర్వేషన్లను ఖరారు చేశారు. ఈ క్రమంలో చైర్మన్, వైస్‌చైర్మన్, డెరెక్టర్ల పదవులకు పేర్లను ఎమ్మెల్యేలు పార్టీ అధిష్ఠానానికి సిఫార్సు చేశారు. అయితే మరో రెండు, మూడు రోజుల్లో భారీ సంఖ్యలో పదవుల పందేరం జరిగే అవకాశం ఉండటంతో ఆశావహులు ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గుంటూరు మార్కెట్(మిర్చి) యార్డు, దుగ్గిరాల మార్కెట్(పసుపు) యార్డు చైర్మన్ పదవులు అత్యంత కీలకమైనవి. గుంటూరు మార్కెట్ యార్డు ఆసియాలోకే పేరొందింది. దీన్ని జనరల్‌కు కేటాయించినట్లు సమాచారం. ఈ పదవి కోసం అనేక మంది సీనియర్ నేతలు పోటీ పడుతున్నారు. మంత్రి లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న దుగ్గిరాల మార్కెట్ యార్డు పదవికి కూడా చాలామంది పోటీ పడుతున్నారు. ఈ యార్డును ఎస్సీలకు రిజర్వ్ చేసినట్లుగా సమాచారం. ఈ చైర్మన్ల నియామకం ఉగాదికి ప్రకటించే అవకాశం ఉందని సమాచారం.

- జిల్లా కేంద్రమైన నరసరావుపేట మార్కెట్ యార్డు చైర్మన్ పదవి టీడీపీ సీనియర్ నేత, పమిడిపాడుకు చెందిన పూనాటి శ్రీనివాసరావును వరించింది.
- సత్తెనపల్లి మార్కెట్ యార్డు చైర్మన్ పదవి కోమటినేని శోభారాణికి దక్కింది. సత్తెనపల్లి ఏఎంసీ చరిత్రలో తొలి మహిళా చైర్మన్ కావడం గమనార్హం. సత్తెనపల్లి మండలంలోని పెదమక్కెన గ్రామానికి చెందిన శోభారాణి తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు సతీమణి. 2013లో ఆమె ఎంపీటీసీగా పోటీ చేసి ఓటమి చెందారు.
- మంగళగిరి యార్డు చైర్మన్‌గా జవ్వాది కిరణ్ చంద్ పేరును అధిష్ఠానం ప్రకటించింది. ఆయన విద్యార్థి దశ నుంచే టీడీపీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉన్నారు. పెదవడ్లపూడికి చెందిన కిరణ్ కుటుంబీకులంతా మొదటి నుంచి టీడీపీలో ఉన్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన ఆయన ప్రస్తుతం తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉన్నారు.
- బాపట్ల మార్కెట్ యార్డు చైర్మన్ పదవి కావూరి శ్రీనివాసరెడ్డిని వరించింది. ఆర్మీలో పనిచేసిన ఆయన 2014లో రాజకీయాలపై ఆసక్తితో టీడీపీలో చేరారు. బాపట్ల మండల పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. గత ఎన్నికల్లో క్లస్టర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ పార్టీ విజయం కోసం శ్రమించారు.
- అద్దంకి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్సీ మహిళకు రిజర్వు కాగా వరగాణి పద్మావతిని పదవి వరించింది.



బాపట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి



అద్దంకి అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పద్మావతి



పి. శ్రీనివాసరావు



జవ్వాది కిరణ్‌చంద్



ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన శోభారాణి

బాపట్ల - చీరాల మధ్య.. టూరిజం సర్క్యూట్

- బ్లూఫ్లాగ్ బీచ్‌గా సూర్యలంక
- అంతర్జాతీయ ప్రమాణాలతో ఎర్యాటక కేంద్రం
- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



అడవిపల్లెపాలెంలోని వి రిసార్ట్స్‌లో వాటర్ పార్క్‌ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు నరేంద్రవర్మ, కొండయ్య

6

సీఎం పర్యటన ఏర్పాట్లు వేగవంతం

- అధికారులకు కలెక్టర్ వెంకటమురళి ఆదేశాలు

బాపట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): చినగంజాం మండలం కొత్తగొల్లపాలెం గ్రామంలో 1న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పర్యటన సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లను వేగవంతం చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఆయన అధికారులతో సమీక్షించారు. శనివారం సాయంత్రంలోగా హెలీప్యాడ్ పనులు పూర్తి చేయాలన్నారు. ప్రజావేదిక ప్రాంగణాన్ని రెండు వేల మంది కూర్చొనేలా సిద్ధం చేయాలని చెప్పారు. సభాప్రాంగణంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలన్నారు.

ఇసుక కొరత రాకుండా చర్యలు

రాబోయే వర్షాకాలంలో ఇసుకకు కొరత రాకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గాజులంక-1, జువ్వలపాలెం రీచ్‌లకు అనుమతులు ముగిసినందున వాటి రెన్యువల్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. ఓలేరు రీచ్‌లో 74 వేల టన్నులు, గాజులంక-2 బీచ్‌లో 40 వేల టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఓలేరు రీచ్‌లో ఇసుక తవ్వకాలకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుకను జిల్లా అవసరాలకు మాత్రమే వాడుకోవాలని ఇతర జిల్లాలకు తరలించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ప్రఖర్‌జైన్, మైన్స్ ఏడీ రాజేష్ బాబు, జిల్లా రవాణాధికారి పరంధామరెడ్డి, డీపీవో ప్రభాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్సీ అనంత రాజు, ఆర్డీవో రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.


రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.25 (శనివారం సాయంత్రం) సహరి : 4.48 (ఆదివారం ఉదయం)



క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

కోరం లేక కారంపూడి ఉప ఎంపీపీ ఎన్నిక వాయిదా



ఎన్నికల అధికారి లింగమూర్తి

కారంపూడి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కారంపూడి ఉప ఎంపీపీ ఎన్నిక రెండో రోజు శుక్రవారం కూడా వాయిదా పడింది. ఉప ఎంపీపీ ఎన్నికకు సంబంధించి 14 మంది ఎంపీటీసీలకు గాను పేటసన్నిగండ్ల ఎంపీటీసీ గాడిపర్తి రమాదేవి ఒక్కరే హాజరు కావడంతో కోరం లేక ఎన్నిక వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి డీఈ లింగమూర్తి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రత్యేక సమావేశం 11 గంటలకు ప్రారంభం కాగా 12 గంటల వరకు వేచి చూసినప్పటికీ సభ్యులు హాజరుకాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించిన నివేదికను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు నివేదిస్తామని చెప్పారు.

కాటూరికి కళారత్న పురస్కారం

తెనాలి, మారీసుపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సూర్య శిల్పశాల, కాటూరి ఆర్ట్ గ్యాలరీ అధినేత శిల్పి కాటూరి వెంకటేశ్వరరావుకు రాష్ట్ర ప్రభుత్వం కళారత్న అవార్డుతో సత్కరించనుంది. శిల్పాలను వివిధ రకాల మెటీరియల్స్‌తో తయారుచేసి దేశ విదేశాలలో సైతం ప్రత్యేక గుర్తింపు పొందడంతో ఉగాది పురస్కారాలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డును అందించనుంది.



శిల్పి వెంకటేశ్వరరావు

దేశంలో ప్రకృతి వ్యవసాయ విస్తరణకు ఆంధ్రప్రదేశ్ దిక్సూచి

రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్

గుంటూరు సిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సుస్థిర వ్యవసాయం ప్రకృతి వ్యవసాయంతోనే సాధ్యం అవుతుందని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి విజయ్ కుమార్ స్పష్టం చేశారు. ప్రస్తుత ఆరోగ్య ఎమర్జెన్సీ సమయంలో మానవాళి ఆరోగ్యం, రైతుల సంక్షేమంతో పాటు, భూ గ్రహ పరిరక్షణ కూడా ప్రకృతి వ్యవసాయంపైనే ఆధార పడిందని అభిప్రాయపడ్డారు. జాతీయ మిషన్ కార్యక్రమ అమలులో భాగంగా మేనేజ్ జాతీయ సంస్థ ఆర్థిక సహకారంతో గుంటూరులో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన మూడురోజుల రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమం చివరి రోజున విజయ్ కుమార్ వర్చువల్‌గా శిక్షణకు హాజరైన అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. శాస్త్రవేత్తలు కూడా వాతావరణంలో వస్తున్న పెను మార్పులకు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సాధికారత తరహాలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో విస్తృతంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ స్థాయిలో ఏర్పాటైన మిషన్ ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని దేశ వ్యాప్తంగా విస్తరించాలని కోరారు. ప్రకృతితో మమేకమై ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలు అమలవుతున్నాయని, ప్రస్తుతం అనుసరిస్తున్న రసాయన వ్యవసాయ విధానాలపై పునరాలోచించాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు.

ఈ సందర్భంగా మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం వెనుక దాగి ఉన్న శాస్త్రీయత, సార్వత్రిక సూత్రాలు, అనుసరిస్తున్న విధానాలు తదితర అంశాలపై వ్యవసాయ శాఖ, సెర్ప్ అధికారులకు ఏ మేరకు అవగాహన కలిగింది అనే విషయాలను అడిగి తెలుసుకొన్నారు. అంతకు మునుపు రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ వరప్రసాద్ ప్రకృతి వ్యవసాయంపై రాష్ట్రంలో చేసిన వివిధ పరిశోధనల ఫలితాల గురించి వివరించారు.



రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమంలో వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్

సీనియర్ థిమాటిక్ లీడ్ డాక్టర్ జాకీర్ ప్రకృతి వ్యవసాయంలో పంటల నిరోధకత (క్రాప్ రెసిలియన్స్) పై అధికారులకు అవగాహన కల్పించారు. గోపీచంద్ ప్రకృతి వ్యవసాయ విస్తరణకు అవసరం అయ్యే ప్రణాళిక, శిక్షణలు, క్షేత్ర స్థాయి కార్యక్రమాల గురించి విపులంగా విశదీకరించారు. చంద్రశేఖర్ క్షేత్ర స్థాయిలో ప్రకృతి వ్యవసాయ విస్తరణకు దోహదం చేసే కార్యక్రమాలు, నాన్ పెస్ట్ మేనేజ్‌మెంట్ దుకాణాలు, మహిళా సంఘాల పాత్ర గురించి వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ థిమాటిక్ లీడ్ సురేష్, సీనియర్ రిసోర్స్ పర్సన్ లు రామచంద్రం, రాజేశ్వర్ తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వచ్చిన వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, అగ్రికల్చర్ ఆఫీసర్లు, సెర్ప్ నుంచి డీపీఎం, ఏపీఎం లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు ప్రకృతి వ్యవసాయంపై అనేక రకాలుగా అవగాహన కల్పించినందుకు రైతు సాధికార సంస్థకు, మేనేజ్ సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతాభినందనలు తెలియజేశారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

నేర సమీక్షా సమావేశంలో ప్రత్యేక ఐపీఎస్ అధికారి హరికృష్ణ

గుంటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలని జిల్లా పోలీసు విభాగానికి నేర సమీక్ష, పర్యవేక్షణ అధికారిగా ప్రభుత్వం నియమించిన ప్రత్యేక ఐపీఎస్ అధికారి హరికృష్ణ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన మార్చి నెల నేర సమీక్షా సమావేశానికి ఐపీఎస్ అధికారి హరికృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ పలు అంశాలపై సమీక్ష నిర్వహించి, నేరాల పరిశోధన, నియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి గుంటూరు జిల్లా పోలీసు విభాగానికి నేర సమీక్ష పర్యవేక్షణ అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఐజీ హరికృష్ణ, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను సీసీటీఎన్ఎస్ (క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్వర్క్ సిస్టం)లో ఎప్పటికప్పుడు పొందుపరుస్తూ ఉండాలని, దీనివలన ఏదైనా వ్యక్తి తరచుగా నేరాలకు పాల్పడుతుంటే అతనిపై నమోదైన కేసులను సులభంగా కనిపెట్టవచ్చని అన్నారు. దాంతో అతనిపై కఠిన చర్యలు తీసుకోవచ్చు అని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్లో సీసీ కెమెరాలు పనిచేసే విధంగా చూసుకోవాల్సిన బాధ్యత స్టేషన్ హౌస్ అధికారిదేనన్నారు. అలాగే పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రధాన కూడళ్లు, జనసంచారం కలిగిన ప్రదేశాలు, నేరాలు జరగడానికి ఆస్కారం ఉన్న ప్రదేశాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా కేసుల పరిశోధనలో విశేష ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ నగదు రివార్డులను అందజేసారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు జీవీ రమణమూర్తి (అడ్మిన్), కె సుప్రజ (క్రైమ్స్), ట్రైనీ ఐపీఎస్ దీక్ష, ఎస్‌బి డిఎస్పీ సీతారామయ్య, డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులకు ఆదేశాలిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

ఈకేవైసీ నమోదుకు ఏప్రిల్ నెలాఖరు వరకు గడువు

● ఎండీయూల ద్వారా కూడా చేసేందుకు ప్రతిపాదన ● కార్డుదారుల ఆందోళన తొలగిస్తూ ప్రభుత్వ ఆదేశాలు

గుంటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రేషన్‌కార్డులోని సభ్యుల పెండింగ్ ఈకేవైసీ ప్రక్రియని పూర్తి చేయడానికి ప్రభుత్వం గడువు పొడిగించింది. తొలుత ఈ నెలాఖరు వరకే ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయితే చాలామంది సభ్యులు అందుబాటులో లేకపోవడం, పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి ఉండటం వంటి కారణాలతో ఈకైవేసీ సంపూర్ణం కాలేదు. దీంతో మరో నెల పాటు గడువుని పొడిగిస్తూ శుక్రవారం సాయంత్రం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కార్యాలయాలకు సమాచారం పంపించింది. ఈకేవైసీ పెండింగ్ ఉన్న వాళ్లకు ఏప్రిల్ నెల రేషన్ పంపిణీ నిలిచిపోతుందని ఎవరూ ఆందోళన చెందవద్దని, మరో నెల పాటు గడువుని ప్రభుత్వం పొడిగించిందని గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా పౌరసరఫరాల అధికారులు సమాచారం ఇవ్వడం ప్రారంభించారు.

ఆధార్ అథెంటికేషన్ ద్వారా ఈకేవైసీ ప్రక్రియని పూర్తి చేస్తారు. ఇది ఒక విధంగా ఈపీఎఫ్‌వో పింఛన్‌దారులు ఏ విధంగా అయితే ఏటా లైఫ్ సర్టిఫికేట్‌లు ఇస్తారో అలాంటి ప్రక్రియే. ఎప్పటినుంచో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో సుమారు నాలుగు లక్షల మంది సభ్యుల ఈకైవేసీ పెండింగ్‌లో ఉన్నది. గుంటూరు జిల్లాలో 1,34,943, పల్నాడు జిల్లాలో 1,68,886, బాపట్ల జిల్లాలో 95,780 మంది ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా ఇప్పటికే ఎవరివైతే ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్నాయో వారి వివరాలతో కూడిన లిస్టులను విడుదల చేశారు. అయితే కొంతమంది మాత్రమే ముందుకొచ్చి ఈకేవైసీని రేషన్ దుకాణాల్లో చేయించుకొన్నారు. ఇంకా చాలామందివి అలానే పెండింగ్‌లో ఉన్నాయి. ఇందుకు కారణం విద్యార్థులు హాస్టల్స్‌లో ఉండటం, వ్యవసాయ కార్మికులు పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి ఉండటమే. అలానే కొంతమంది చనిపోయినప్పటికీ వాళ్ల పేర్లను స్వచ్ఛందంగా తొలగించకుండా ప్రతీ నెలా రేషన్ పొందుతున్నారు.

ప్రస్తుతం ఈకేవైసీ ప్రక్రియ రెండు వ్యవస్థల ద్వారానే జరుగుతున్నది. రేషన్ డీలర్ల వద్ద ఈ-పోస్ యంత్రాలలో ఆధార్ అథెంటికేషన్(వేలిముద్ర) వేసి చేసుకోవచ్చు. వీఆర్‌వోల వద్ద అయితే ఆధార్‌తో పాటు ఐరిస్, ఫేస్ రికగ్నిషన్ ద్వారా కూడా ఈకేవైసీ చేసుకొనే సదుపాయం ఉన్నది. ఈ సదుపాయాన్ని ఎండీయూ ఆపరేటర్లకు కూడా కల్పించాల్సిందిగా స్థానిక అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. దీని వలన రేషన్ పంపిణీకి ఎండీయూ వెళ్లినప్పుడు సరుకులు తీసుకోవడానికి వచ్చే వారి కుటుంబాల్లో ఎవరి ఈకేవైసీ పెండింగ్‌లో ఉందో వాళ్లు చెబుతారు. దాంతో అక్కడే ఈకేవైసీ ప్రక్రియ పూర్తి అవుతుందని గుంటూరు జిల్లా పౌరసరఫరాల అధికారి కోమలి పద్మ తెలిపారు. అధికారికంగా ప్రభుత్వం నుంచి ఆమోదం రాగానే ఆ వివరాలను తెలియజేస్తామన్నారు.

గుంటూరు మీదగా నరసపూర్ - అర్సికెరె ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వారాంత రద్దీ దృష్ట్యా ఏప్రిల్, మే నెలల్లో ప్రతీ ఆదివారం నరసపూర్ - అర్సికెరె ప్రత్యేక రైలుని గుంటూరు మీదగా నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07201 నరసపూర్ - అర్సికెరె ప్రత్యేక రైలు ఏప్రిల్ 6వ తేదీ మొదలుకొని మే 25వ తేదీ వరకు ప్రతీ ఆదివారం మధ్యాహ్నం 2.20కి బయలుదేరి సాయంత్రం 6.25కి గుంటూరు, రాత్రి 7.14కి నరసరావుపేట, సోమవారం ఉదయం 8.55కి యల్హంక, మధ్యాహ్నం 12.45కి అర్సికెరెకు చేరుకొంటుంది. నంబరు. 07202 అర్సికెరె - నరసపూర్ ప్రత్యేక రైలు ఏప్రిల్ 7వ తేదీ మొదలుకొని మే 26వ తేదీ వరకు ప్రతీ సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి సాయంత్రం 4.45కి యల్హంక, మంగళవారం ఉదయం 6.24కి నరసరావుపేట, 7.20కి గుంటూరు, మధ్యాహ్నం 1 గంటకు నరసపూర్ చేరుకొంటుందన్నారు.

గుంటూరు మీదగా రైళ్ల దారి మళ్లింపు

కాజీపేట - కొండపల్లి మధ్యన మహబూబాబాద్ స్టేషన్‌లో మూడో రైలు మార్గం ప్రీనాన్ ఇంటర్‌లాకింగ్, నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా పలు రైళ్లను గుంటూరుమీదగా దారి మళ్లిస్తున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు. విశాఖపట్టణం - ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్, ఎల్‌టీటీ - విశాఖపట్టణం ఎక్స్‌ప్రెస్‌ని మే 22 నుంచి 28వ తేదీ వరకు, షాలిమార్ - హైదరాబాద్ రైలుని మే 27, 28 తేదీల్లో, హైదరాబాద్ - షాలిమార్ రైలుని మే 28,29 తేదీల్లో, సీఎస్‌టీ ముంబై-భువనేశ్వర్ రైలుని మే 27,29 తేదీల్లో, భువనేశ్వర్ - సీఎస్‌టీ ముంబై రైలుని మే 27, 28 తేదీల్లో, సాయినగర్ షిర్డి - కాకినాడపోర్టు రైలు మే 27న, కాకినాడ పోర్టు-సాయినగర్ షిర్డి, సాయినగర్ షిర్డి- మచిలీపట్నం, షాలిమార్ - సికింద్రాబాద్ రైళ్లు మే 28న, ఎర్నాకుళం - బరౌని రైలు మే 23న పగిడిపల్లి మార్గంలో గుంటూరు మీదగా మళ్లించడం జరుగుతుందన్నారు.

వారం పాటు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రద్దు

నిత్యం గుంటూరు-సికింద్రాబాద్ మధ్యన వరంగల్ మార్గంలో ప్రయాణించే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ని నాన్ ఇంటర్‌లాకింగ్ పనులు కారణంగా వారం పాటు రద్దు చేస్తున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు. నంబరు. 12705 గుంటూరు - సికింద్రాబాద్, నంబరు. 12706 సికింద్రాబాద్ - గుంటూరుఇంటర్‌సిటీ రైళ్లు మే23 నుంచి 29 వరకు రద్దు చేస్తున్నామన్నారు.

జూన్ వరకు కటక్, హైదరాబాద్ రైళ్ల పొడిగింపు

వారంలో ఒక రోజు గుంటూరు మీదగా ప్రయాణిస్తున్న హైదరాబాద్, కటక్ రైళ్లను ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జూన్ నెల చివరి వారం పొడిగిస్తున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు. నంబరు. 07165 హైదరాబాద్ - కటక్ రైలు ప్రతీ మంగళవారం ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జూన్ 24వ తేదీ వరకు, నంబరు. 07166 కటక్ - హైదరాబాద్ రైలు ప్రతీ బుధవారం ఏప్రిల్ 2వ తేదీ నుంచి జూన్ 25వ తేదీ వరకు పొడిగిస్తున్నామన్నారు.

ఉగాదికి ప్రత్యేక రైళ్లు

ఉగాది పండగకు ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా రెండు ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదగా నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07271 గుంటూరు - ఎస్ఎస్ఎస్ హుబ్లీ ప్రత్యేక రైలు ఈ నెల 31వ తేదీన రాత్రి 8 గంటలకు బయలుదేరి నరసరావుపేట, వినుకొండ, మార్కాపురం రోడ్డు, కంభం, గిద్దలూరు, నంద్యాల, డోన్, గుంతకల్లు, బళ్ళారి, తోర్నగల్లు, హోస్‌పేట, మునిరాబాద్, కొప్పల్, బానాపూర్, బన్ని కొప్ప, గడగ్, అన్నిగేరి మీదగా మరుసటి రోజు ఉదయం 9.20కి హుబ్లీ చేరుకొంటుంది. నంబరు. 07272 హుబ్లీ - గుంటూరు రైలు ఏప్రిల్ 1వ తేదీన ఉదయం 11 గంటలకు బయలుదేరి పైన పేర్కొన్న స్టేషన్ల మీదగా తిరుగు ప్రయాణమై 2వ తేదీ వేకుమజామున 3 గంటలకు గుంటూరు చేరుకొంటుంది. ఈ రైళ్లలో స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ భోగీలుంటాయని సీపీఆర్‌వో తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

పోలీసు, రెవెన్యూ కలిసి పని చేస్తే శాంతి భద్రతలు పరిరక్షించవచ్చు

- స్పెషల్ ఐజీ చంద్రశేఖర్ - రౌడీషీటర్‌కు రిమాండ్ విధించిన తహసీల్దార్ గోపాలకృష్ణకు పోలీసుల సన్మానం

తెనాలి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్‌కు మేజిస్ట్రేట్ హోదాలో తహసీల్దార్ రిమాండ్ విధించిన సంఘటనలలో తహసీల్దార్‌ను పోలీసు శాఖ ఘనంగా సత్కరించింది. నేరాల అదుపు కోసం పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పని చేస్తే శాంతి భద్రతలు నెలకొంటాయని స్పెషల్ ఐజి చంద్రశేఖర్ అన్నారు. తెనాలి తహసీల్దార్‌గా పని చేస్తున్న కెవి గోపాలకృష్ణ ఇటీవల ఓ రౌడీషీటర్‌కు 30 రోజుల పాటు రిమాండ్ విధిస్తూ తీర్పు వెలువరించారు. తెనాలి వైకుంఠపురానికి చెందిన అన్నం సతీష్ అనే రౌడీషీటర్‌ను పలు దౌర్జన్యకర సంఘటనలు, కొట్లాటకు సంబంధించిన కేసుల్లో వన్ టౌన్ పోలీసులు తహసీల్దార్ ముందు ఇటీవల బైండోవర్ చేశారు. అప్పుడే సంవత్సరం పాటు సత్‌ప్రవర్తనతో ఉండాలని, ఆ షరతులను ఉల్లంఘిస్తే రూ.2 లక్షలు జరిమానాతో పాటు జైలుకు కూడా పంపుతామని ఒప్పంద పత్రంపై సంతకాలు చేయించి పంపారు. ఇది జరిగిన రెండు నెలలకే ఆ రౌడీషీటర్ మరో యువకుడిని చితకబాది డబ్బులు దోచుకున్న సంఘటనలో వన్ టౌన్ పోలీసులు వారం క్రితం తెనాలి తహసీల్దార్ ఎదుట హాజరు పరిచారు. దీనికి ముందు రెండుసార్లు అతనికి నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడం, ఆగడాలు ఆపకపోవడంతో తీవ్రంగా పరిగణించిన తహసీల్దార్ మేజిస్ట్రేట్ హోదాలో చట్టం పరిధికి లోబడి అతనికి 30 రోజులు రిమాండ్ విధించారు. అప్పుడే రేపల్లె సబ్‌జైలుకు కూడా తరలించారు. అయితే ఈ సంఘటన పోలీసు, రెవెన్యూ వర్గాలలో చర్చనీయాంశమైంది. తహసీల్దారే నేరుగా రిమాండ్ విధించడం అరుదైన సంఘటన కావడంతో శుక్రవారం గుంటూరులో జరిగిన క్రైం మీటింగ్‌లో తహసీల్దార్ గోపాలకృష్ణను స్పెషల్ ఐజి చంద్రశేఖర్, గుంటూరు ఎస్పి సతీష్‌కుమార్‌లు ఘనంగా సత్కరించారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది కలిసి పని చేయడంతో పాటు ఉన్న అధికారాలను సద్వినియోగం చేస్తే చాలా నేరాలను అదుపు చేయవచ్చని ఐజి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఫలితంగా న్యాయ వ్యవస్థపైన ఒత్తిడి తగ్గుతుందని, నేరాలు కూడా చాలా వరకు కట్టడి అవుతాయని పేర్కొన్నారు. ఇదే సంఘటనకు సంబంధించి తెనాలి వన్ టౌన్ సిఐ మల్లికార్జునరావుకు రూ.25 వేల నగదు బహుమతిని ఎస్పి సతీష్‌కుమార్ అందించారు. నా డ్యూటీని చట్టపరిధిలో ఉన్న నా అధికారాలను అమలు పరిచానని దీని కోసం ప్రత్యేకించి సొంత నిర్ణయాలు తీసుకోలేదని, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్) తహసీల్దార్‌లకు కల్పించిన అధికారాలను అందరూ సద్వినియోగం చేస్తే చాలా వరకు నేరస్తులను కట్టడి చేయవచ్చని ఆ పనే నేను చేశానని, దీనికి పోలీసు శాఖ నన్ను సత్కరించడం సంతోషం కలిగించిందని తహసీల్దార్ గోపాలకృష్ణ ఆనందం వ్యక్తం చేశారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

మాచవరం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మాచవరం మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 4.75 కోట్లు ఉపాధి హామీ పనులు జరిగాయని వీటిలో రూ. 4.56 కోట్లు ఉపాధి కూలీల వేతనం కాగా రూ. 19 లక్షలు మెటీరియల్ పనులు జరిగాయని డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో వెంగళరావు అధ్యక్షత వహించగా, డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామాల వారీగా జరిగిన పనులపై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగణేషునిపాడు గ్రామానికి చెందిన సర్పంచ్ పల్లా నరేంద్ర, మాజీ సర్పంచ్ చల్లగుండ్ల బిక్షయ్యలు మాట్లాడుతూ, కొత్తగణేషునిపాడు గ్రామంలోనే అంగన్‌వాడీ కార్యకర్తకు, వేరే గ్రామాల్లో పని చేస్తున్న సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లకు, బంధువులకు పూర్తిగా పక్షవాతం వచ్చి మంచంలో ఉన్న వారికి ఇలా రకరకాలుగా పనికి వెళ్ళక పోయినప్పటికీ వారి పేర్లపై స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ వేతనాలు వేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై గ్రామంలో పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ పల్లా నరేంద్ర, మాజీ సర్పంచ్ చల్లగుండ్ల బిక్షయ్యలు డ్వామా పీడీకి రాత పూర్వకంగా అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా పీడీ సిద్ధ లింగమూర్తి మాట్లాడుతూ గ్రామంలో ఏపీడీ ద్వారా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుత వేసవి కాలంలో గ్రామాల్లో పశువులకు నీటి తొట్లు, సేద్యపు నీటి కుంటలు, పంట కాలువలను పునరుద్ధరించటం, చెరువులను, కుంటలను అభివృద్ధి పరచడం, కూలీలకు దినసరి వేతనం మూడు వందలు వచ్చే విధంగా స్థానిక అధికారులు పనులు చేయించాలని పీడీ ఆదేశించారు. ముఖ్యంగా ఫీల్డ్ అసిస్టెంట్‌లు బాధ్యతాయుతంగా వ్యవహరించి పనులు సక్రమంగా చేయించి వారికి సక్రమంగా వేతనం అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంగళరావు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎడ్లబల ప్రదర్శనను జయప్రదం చేద్దాం

తెనాలి రూరల్, మార్చి28(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో శనివారం నుంచి ఏప్రిల్ 4 వరకూ జరగనున్న ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ ఎడ్లబల ప్రదర్శన, పశు పాల పోటీలలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పట్టణ టీడీపీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ శనివారం సాయంత్రం నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమాలకు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్లమనోహర్ పాల్గొని ఎడ్లబలప్రదర్శనను, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు వ్యవసాయ విజ్ఞాన ప్రదర్శనను ప్రారంభిస్తారన్నారు. ఈ నెల 29న టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని 40 వార్డులో, గ్రామాల్లో ఆయా పార్టీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి పార్టీ జెండాలను ఆవిష్కరించనున్నారని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, పార్టీ నాయకులు

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



ఇమామ్, మౌజన్‌లకు రంజాన్ తోఫా నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

ప్రజలంతా శాంతియుత జీవనం సాగించాలి

● వేగేశన ఫౌండేషన్ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

● ఇమామ్, మౌజన్‌లకు రూ.4 వేల చొప్పున పంపిణీ

బాపట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర రంజాన్ మాసంలో కఠోర ఉపవాస దీక్షలు చేసే ముస్లింల ప్రార్థనలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరు శాంతియుతంగా జీవించాలని వేగేశన ఫౌండేషన్ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కోరారు. ప్రతి ఏడాది వలే ఈ ఏడాది కూడా రంజాన్ తోఫా కార్యక్రమాన్ని శుక్రవారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. వేగేశన ఫౌండేషన్ ద్వారా గత 9 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని 104 మంది ఇమామ్, మౌజన్‌లకు రూ.4 వేల చొప్పున రంజాన్ తోఫా అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్‌మాసంలోనే ఫౌండేషన్ స్థాపించానని అందరి ప్రార్థనా బలంతో సేవలు కొనసాగిస్తూ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని చెప్పారు. రాబోయే రోజుల్లో సేవలు విస్తృతం చేస్తానని అందరూ సమైక్యంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు మందపాటి ఆంధ్రేయ, బూర్లె రామసుబ్బారావు, పట్టణ పార్టీ మాజీ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ, కూచిపూడి ఝాన్సీరాణి, ఫరీద్ మస్తాన్, దగ్గుమల్లి కిరణ్‌కుమార్, కూచిపూడి శ్యామ్ సుందర్, కాగిత నాగభూషణమ్మ, దగ్గుమల్లి రాణి, ముస్లిం పెద్దలు షేక్ బాజి, ఖలీలుల్లాఖాన్, కాలేషా, ఎండీ ఖాన్, సుభాని, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

బర్లి పొగాకు మార్కెట్‌ను ప్రారంభించాలి

● నల్లమడ రైతు సంఘం నాయకుడు డాక్టర్ కొల్లా



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

బాపట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : బర్లి పొగాకు మార్కెట్‌ను కంపెనీలు వెంటనే ప్రారంభించాలని నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్ శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌కు తెలిపారు. ఐటీసీ, జీపీఐ, అలియన్స్ తదితర పొగాకు కంపెనీల ప్రతినిధులతో నల్లమడ రైతు సంఘం సమావేశాన్ని జేసీ ఏర్పాటు చేశారు. నల్లమడ రైతు సంఘం నాయకుడు డాక్టర్ కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ కంపెనీల ఫీల్డ్‌స్టాఫ్ కూడా ధర వస్తుందని, పండించమని ప్రోత్సహించటం వల్ల ఎక్కువగా బర్లి పొగాకు వేశారని ఇప్పుడు కంపెనీలు కొనకపోవటంతో దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారని ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు మాట్లాడుతూ కంపెనీలు బర్లి పొగాకు కొనుగోలు వెంటనే ప్రారంభించాలని, గత సంవత్సరం ధరలకే కొనుగోలు చేయాలని కోరారు. కంపెనీ ప్రతినిధులు త్వరలో కంపెనీలన్ని సమావేశమై కొనుగోలు తేదీ ప్రకటిస్తామన్నారు. జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణారావు మాట్లాడుతూ కంపెనీ ప్రతినిధులు రైతులను ప్రోత్సహించటం తమ దృష్టికి కూడా వచ్చిందన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వీలైనంత త్వరలో కొనుగోలు ప్రారంభించమని కంపెనీల యాజమాన్యాలను కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కారుమంచి విజయ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు రామకృష్ణ, జి.గంగయ్య, రైతులు పాలేటి వీరయ్య, జి.సత్యనారాయణ, దాసరి రామకృష్ణ, ఇనగంటి బాబు, కారుమూడి వెంకట్రావు, దొప్పలపూడి హరిబాబు, నాయుడు సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు ఎస్పీ ప్రశంస



కర్లపాలెం ఎస్సై రవీంద్రకు ప్రశంసపత్రం అందజేస్తున్న ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : విధినిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులను ఎస్పీ తుషార్ డూడి అభినందించి ప్రశంసపత్రాలు అందజేశారు. జిల్లాలో 21 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని శుక్రవారం జరిగిన సమావేశంలో ఎస్పీ అభినందించారు. చినగంజాం పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన హత్యలో నిందితుడికి నేరం జరిగిన 9 నెలలలోపే జీవితఖైదు, జైలుశిక్ష పడేవిధంగా చర్యలు తీసుకున్న ఇంకొల్లు సీఐ రమణయ్య, చినగంజాం ఎస్ఐ రమేష్, కోర్టు కానిస్టేబుల్ రమేష్‌లను, బాపట్ల రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో మహిళా హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగారశిక్ష పడేవిధంగా చర్యలు తీసుకున్న రూరల్ సీఐ శ్రీనివాసరావు, కోర్టు హెడ్‌కానిస్టేబుల్ శివయ్య, లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులను పరిష్కరించిన కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర, అద్దంకి సీఐ సుబ్బరాజు, చీరాల వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావులను, సైబర్ నేరాలను చేధించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్ఐ శ్రీకాంత్, చీరాల టుటౌన్ సీఐ నాగభూషణం, అమర్తలూరు ఎస్ఐ అమరవర్ధన్, సైబర్ సెల్ మహిళా కానిస్టేబుల్ కీర్తి, ఐటీ కోర్ మహిళా కానిస్టేబుల్ కవిత, కానిస్టేబుల్ రామ్మోహనరావు, సోషల్ మీడియా కానిస్టేబుల్ రాజ్‌కుమార్, డీసీఆర్‌బీ కానిస్టేబుల్ సువర్ణరాజు, వెంకటేశ్వర్లును, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని లింగసమానత్వం చాటేవిధంగా వివిధ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించిన ఉమెన్ పీఎస్ సీఐ శ్రీనివాసరావు, మహిళా కానిస్టేబుల్ వెన్నెల, ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహిస్తున్న సీఐ శ్రీనివాసులు, ఎస్సై శ్రీనివాసరావులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసపత్రాలు అందజేశారు.

వక్ఫ్ బోర్డులో అన్యమతస్థుల నియామకంపై నిరసన

బాపట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్‌బోర్డులో అన్య మతస్థులను నియమించటాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని అంజుమన్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రహీమ్‌జానీ అన్నారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు జనరల్ సెక్రటరి మౌలానా ఫజలుల్, రహీమ్, జమైతుల్, ఉలేమాహిందు, దేవబంద్ సంస్థ ఛైర్మన్ హర్షద్ మదినీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం బాపట్లలోని ముస్లింలు నల్లబ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు. కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రహీమ్‌జానీ మాట్లాడుతూ ముస్లింల వక్ఫ్‌బోర్డు ఆస్తులను వారికి దక్కకుండా ఉండేందుకు అన్యమతస్థులను కమిటీలో సభ్యులుగా చేర్చటాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అంజుమన్ కమిటీ సెక్రటరి అబ్దుల్ కరీం, ఉపాధ్యక్షుడు షేక్ బాజి, జాయింట్ సెక్రటరి మహ్మద్ రఫీ, ట్రెజరర్, మీరాసాహెబ్, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి

కర్లపాలెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన విద్యుత్‌ను 24 గంటలు వినియోగదారులకు ఇవ్వాలని, కరెంట్‌కోతలు ఉండకుండా చూడాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. కర్లపాలెం మండలం గణపవరం గ్రామాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్, ఆధార్ సెంటర్, కమ్యూనిటి హెల్త్ సెంటర్‌ను, సచివాలయాలను శుక్రవారం ఎంపీడీవో సందర్శించి పలు సూచనలు చేశారు. గ్రామంలో చలివేంద్రాన్ని ఎంపీడీవో శ్రీనివాసరావు ప్రారంభించారు.

● కర్లపాలెం యాక్షన్ టవర్స్ వద్ద హైదరాబాద్ వలి తండ్రి అబ్దుల్ రజాక్ (మాజీ ఆర్మీ) జ్ఞాపకార్థం చలివేంద్రంను వారి కుమారులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఆదివారం మజ్జి పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బాలా, ఈశ్వర్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నారాయణచార్యులకు ఘన నివాళి

బాపట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : శివతాండవం, కావ్యం సృష్టికర్త, తెలుగు సాహితీకారులలో అగ్రగణ్యుడు, బహుభాషాకోవిదుడు పుట్టపర్తి నారాయణచార్యులని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాల ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ ఎస్.వినోద్ అన్నారు. కళాశాలలో శుక్రవారం పుట్టపర్తి నారాయణచార్యులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వినోద్ మాట్లాడుతూ తెలుగులో రాసిన శివతాండవం ఆయనకు ఎనలేని కీర్తిప్రతిష్ఠలు తెచ్చిపెట్టిందని తెలిపారు. అదేవిధంగా స్థానిక డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ డిడి స్మిత్, డాక్టర్ జి.రవిబాబులు నారాయణచార్యులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇది ప్రజా విజయం

● అభినందన సభలో ఎమ్మెల్సీ రాజేంద్ర ప్రసాద్



ఆలపాటిని సత్కరిస్తున్న ఆనందబాబు, విజయబాబు తదితరులు

వేమూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : దేశ చరిత్రలోనే ఎప్పుడు ఇంత వరకు ఎమ్మెల్సీ స్థానాల్లో ఇంతటి ఘన విజయం సాధించిన వ్యక్తి ఎవరూ లేరని, తన విజయం ప్రజా విజయంగానే భావిస్తున్నానని కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీగా ఘన విజయం సాధించిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. వేమూరులో శుక్రవారం రాత్రి ఆలపాటి అభినందన సత్కార కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అధ్యక్షత వహించారు. సభలో ఆలపాటి మాట్లాడుతూ ప్రజల మధ్యనే తన జీవితం గడపాలన్నది తన ఆలోచన అని, తన విజయం ఎమ్మెల్సీగా కొత్త అనుభూతిని కలిగిస్తుందన్నారు. తన కుటుంబంలో సభ్యుడిగా మెలుగుతూ రాజకీయ బాటలో కలిసి అడుగులు వేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు చేసిన కృషి మరువలేనిదన్నారు. ప్రజలతో మమేకమైన నాడు ఏ నాయకునికైనా ఎదుగుదల తప్పనిసరిగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ రాజకీయ అనుభవం ఆలపాటి ద్వారానే తనకు వచ్చిందన్నారు. వేమూరుకు తనను పరిచయం చేసి మంత్రిగా, ఎమ్మెల్యేగా తీర్చిదిద్దారని అందుకు ఆలపాటికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. రాజేంద్రప్రసాద్ సతీమణి మాధవి మాట్లాడుతూ వేమూరు నియోజకవర్గమంటే తమకు ఎంతో ఇష్టమని, రాజేంద్ర ప్రసాద్ గెలుపునకు నియోజకవర్గంలోని ప్రతి మహిళ సహకరించారన్నారు. సభలో ఆలపాటి దంపతులను ఆనందబాబు, విజయబాబు ఘనంగా సత్కరించారు. పార్టీ నాయకులు మైనేని మురళీకృష్ణ, డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, గొట్టిపాటి భానుగంగాధర్, అమ్మిశెట్టి కిషోర్‌బాబు, శివారెడ్డి, చిట్టిబాబు, సుధాకర్, షేక్ హనీఫ్, పార్టీ పరిశీలకులు వంగా సాంబిరెడ్డి, ఘంటా స్వాతి, గవిని లక్ష్మీదుర్గ, రమాదేవి, దండే వెంకట సుబ్బారావు, శేషుబాబు, శరత్‌చంద్ర, దిలీప్‌రాజా, జనసేన నాయకులు ఉసా రాజేష్, సోమరౌతు అనురాధ, బీజేపీ నాయకులు మందా జనార్ధన్, సాంబశివరావు తదితరులు ప్రసంగించారు. ఐదు మండలాల పరిధిలోని ఆలపాటి అభిమానులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని జంపని శివారు నుండి బాణాసంచా, మేళతాళాలతో జయధ్వనాలు చేసుకుంటూ ర్యాలీతో ఆలపాటిని ఎన్టీఆర్ పురవేదిక వద్దకు ఆహ్వానించారు.

అసాంఘిక కార్యకలాపాలు అరికట్టాలి

● ఎస్పీ తుషార్ డూడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్‌డూడి, హాజరైన జిల్లాలోని పోలీసు అధికారులు

బాపట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ తుషార్‌డూడి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ కేసులలో పురోగతిని ఎప్పటికప్పుడు సీసీటీఎన్ఎస్‌లో పొందుపర్చాలన్నారు. అర్జీదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని అత్యవసర ఫోన్‌కాల్స్‌కు వేగంగా స్పందించాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించటాన్ని పూర్తి స్థాయిలో కంట్రోల్ చేయాలన్నారు. హైవేల దగ్గర ఉన్న వెంచర్లు, శిథిలావస్థలో నిరుపయోగంగా ఉన్న భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయన్నారు. డ్రోన్‌ల సాయంతో నిర్మానుష్య ప్రదేశాలు, బహిరంగ ప్రదేశాలలో తనిఖీలు చేయాలన్నారు. రోడ్డుప్రమాదాలు జరిగే ప్రదేశాలలో హెచ్చరిక బోర్డులు, బ్లింకింగ్ లైట్స్, జీబ్రా క్రాసింగ్ లైట్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారవేదిక ద్వారా వచ్చే అర్జీలను చట్టపరిధిలో విచారించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలన్నారు. వేసవిలో విహారయాత్రలకు, బంధువుల ఇళ్ళకు వెళ్ళేవారు ఎక్కువగా ఉంటారు కావున ఆ సమయంలో దొంగతనాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. పోలీసు అధికారులు ఆ ప్రదేశాలలో గస్తీ విధులను ముమ్మరం చేయాలన్నారు. అనుమానితులు కనిపిస్తే మొబైల్ సెక్యూరిటి చెక్ డివైస్ ద్వారా వేలిముద్రలు స్కాన్ చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 20మంది పాతనేరస్తులను గుర్తించటం జరిగిందన్నారు. వారిపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. విచారణ దశలో ఉన్న కేసుల దర్యాప్తు వేగవంతంగా నిర్వహించాలన్నారు. శక్తియాప్ గురించి మహిళలకు, విద్యార్థినీలకు విస్తృత అవగాహన కల్పించి యాప్ వినియోగం గురించి తెలియజేయాలన్నారు. శక్తియాప్, 100, 112 కాల్స్‌కు త్వరితగతిన స్పందించకపోతే శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ టిపి విఠలేశ్వర్, డిఎస్పీలు రామాంజనేయులు, మోయిన్, శ్రీనివాసరావు, ఏఆర్‌డిఎస్పీ విజయసారధి, ట్రైనీ డిఎస్పీ రావూరి అభిషేక్. ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ నారాయణ, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ బాల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్‌గా కావూరి



శ్రీనివాసరెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల వ్యవసాయ మార్కెటింగ్ యార్డు కమిటీ ఛైర్మన్‌గా కావూరి శ్రీనివాసరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడిగా ఉన్న శ్రీనివాసరెడ్డి గతంలో ఆర్మీ ఉద్యోగిగా, సింగరేణి ఉద్యోగిగా పనిచేసి 2014వ సంవత్సరంలో రాజకీయాల పట్ల ఆకర్షితుడై బాపట్ల వచ్చి తెలుగుదేశం పార్టీలో చేరి క్రియాశీలకంగా పని చేశారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా పని చేస్తూ 2014, 2019, 2024 ఎన్నికలలో అభ్యర్థుల విజయం కోసం విశేష కృషి చేశారు. రెడ్డి సామాజిక వర్గ ఓటర్లను తెలుగుదేశం పార్టీ వైపునకు తీసుకొచ్చేవిధంగా పనిచేసి రెండు దశాబ్దాల తర్వాత బాపట్లలో టీడీపీ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ గెలుపు కోసం పాటుపడ్డారు. పార్టీ కోసం ఆయన చేసిన కృషిని గుర్తుపెట్టుకొని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మార్కెటింగ్ యార్డు కమిటీ ఛైర్మన్‌గా నియమించే విధంగా చేశారు. శుక్రవారం ఆయన నియామకం గురించి తెలుసుకున్న ఎమ్మెల్యేతోపాటు పలువురు కావూరి శ్రీనివాసరెడ్డిని అభినందించారు.

ప్రత్యేక కోర్టుల ద్వారా పిల్లల కేసులు విచారణ

● బాపట్ల అడిషనల్ సివిల్ జడ్జి ఎం.పవన్‌కుమార్



సదస్సులో మాట్లాడుతున్న బాపట్ల అడిషనల్ సివిల్ జడ్జి పవన్‌కుమార్

బాపట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : లైంగిక వేధింపులు, అశ్లీలత వంటి నేరాల నుంచి పిల్లలను రక్షించటానికి, అటువంటి నేరాల విచారణ కోసం ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయటం జరిగిందని బాపట్ల అడిషనల్ సివిల్ జడ్జి ఎం.పవన్‌కుమార్ తెలిపారు. బాపట్లలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. మండల న్యాయసేవాధికార కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు జడ్జి పవన్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పిల్లలకు గృహహింస, భరణం, విద్యాహక్కుచట్టం మొదలగు చట్టాలపై అవగాహన కలిగియుండాలన్నారు. ఫోక్సో యాక్ట్ గురించి తెలియజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

● జిల్లా ఉద్యానవనశాఖాధికారిణి పి.జెన్నెమ్మ

బాపట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మామిడి, జీడిమామిడి సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యానవనశాఖాధికారిణి పి.జెన్నెమ్మ తెలిపారు. బాపట్ల జీడిమామిడి పరిశోధన స్థానంలో శుక్రవారం మేలైన యాజమాన్య పద్ధతులు, సమగ్రసస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జెన్నెమ్మ అధ్యక్షత వహించి మాట్లాడుతూ మామిడి, జీడిమామిడి పంటల్లో అధిక ఉత్పత్తికి, నాణ్యమైన పంటలు పండించటానికి, తెగుళ్ళు, చీడపీడలు నివారించేందుకు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. జీడిమామిడి పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మామిడి పంటలో కాయలను కోసిన తర్వాత వాటిని ప్లాస్టిక్ ట్రేలలో మాత్రమే ఉంచి నీడన పెట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సూక్ష్మసేద్యపు అధికారి బీవీ రమణ, కీటక శాస్త్ర నిపుణులు డాక్టర్ జి.స్రవంతి, డాక్టర్ ఆర్.బాలమురళీధర్‌నాయక్, డీపీఎం వాణిశ్రీ, వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన రైతులు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ

కర్లపాలెం, మార్చి28 (ఆంధ్రజ్యోతి) : అబ్దుల్ కలాం ఫౌండేషన్ ద్వారా పాతకర్లపాలెంలోని 12 మంది నిరుపేద మహిళలకు, ఎంవిరాజుపాలెంలో 12 మందికి నూతన దుస్తులు, చీరెలు బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త శివన్నారాయణ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, కర్లపాలెం గ్రామ ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్‌బాషా, జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు చిలకల సురేంద్ర, ఇడుగు రాజేష్, కొండపాటూరు వీరాంజనేయులు, ఆశీర్వాదం పాల్గొన్నారు.

కమిషనరేట్‌కు ఈఎస్ దేవదత్తు?

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటున్నందుకు సరెండర్ నోటీసులు అందుకున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ దేవదత్తు శుక్రవారం ఎక్సైజ్ కమిషనరేట్ బాట పట్టినట్లు సమాచారం. కలెక్టర్ సరెండర్ ఆదేశాలు ఇచ్చినా వాటిని ఆయన ఖాతరు చేయకపోవడంపై చర్చకు దారి తీసిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలపై వివరణ ఇచ్చుకునే క్రమంలో ఎక్సైజ్ ఉన్నతాధికారులను ఈఎస్ దేవదత్తు కలిసినట్లు తెలుస్తోంది. కలెకర్ వెంకటమురళి ఇచ్చిన సరెండర్ ఉత్తర్వులలో కూడా కమిషనరేట్‌లో రిపోర్టు చేయమని ఉంది. సరెండర్ ఆదేశాలనే కమిషనరేట్ కొనసాగిస్తుందా లేక మరేదైనా నిర్ణయం ఉంటుందా అనేది తేలాల్సి ఉంది. ఇప్పటికే ఏఈఎస్ వెంకటేశ్వర్లు ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తుండడంతో రాష్ట్ర స్థాయిలో కమిషనరేట్ తీసుకునే నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఆక్వా పార్కుకూ నిధులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం శంకుస్థాపనలకే పరిమితం చేసిన ఆక్వా పార్కు నిర్మాణానికి కూడా రూ.88.08 కోట్లు నిధుల విడుదలకు ప్రభుత్వం పరిపాలనాపరమైన అనుమతులను శుక్రవారం విడుదల చేసింది. నిజాంపట్నం మండల పరిధిలోని పరిశవారిపాలెం వద్ద ఇది నిర్మాణం కానుంది. జిల్లాలో దాదాపు 21,500 ఎకరాల్లో ఆక్వా విస్తీర్ణం ఉంది. ఆక్వా పార్కు నిర్మాణం పూర్తయితే ఈ రంగం మరింత వృద్ధి చెందడానికి ఉపయోగపడుతుంది. దీనికి సంబంధించి నిధుల మంజూరులో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద రూ.52.85 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.35.23 కోట్లు విడుదలకు అనుమతులు ఇచ్చాయి

రుణ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

కొల్లూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బీసీ, ఈబీసీ కులాల వారికి రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి శుక్రవారం బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కొల్లూరు మండలంలో బీసీ కార్పొరేషన్ కింద బీసీలకు 15 రుణాలు, కాపు కార్పొరేషన్‌కు 14, ఈడబ్ల్యూఎస్ కింద 10 రుణాలకు సంబంధించి మొత్తం ఆన్‌లైన్‌లో 246 దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 187 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా వివిధ బ్యాంకు మేనేజర్లు దరఖాస్తుదారులను ఇంటర్వ్యూలు చేశారు. ఇంటర్వ్యూలో బ్యాంకు అధికారులతో పాటు ఎంపీడీవో కె.నరసింహారావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రుణమేళా కార్యక్రమంలో 204 దరఖాస్తులు

వేమూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన వెనుకబడిన తరగతుల వారికి సబ్సిడీ రుణాలు ఇచ్చేందుకు శుక్రవారం స్థానిక రోశయ్య మీటింగ్ హాలులో రుణమేళా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో శివన్నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆన్‌లైన్ ద్వారా 204 దరఖాస్తు చేసుకోగా 169 మంది హాజరైనట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శేఖర్, కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చిమిర్చికి కనీస మద్దతు ధర కల్పించాలి

చెరుకుపల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి) : పచ్చి మిర్చి రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలని మండలంలోని తుమ్మలపాలెం గ్రామం నుంచి రేపల్లె నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ ఆధ్వర్యంలో రైతులు, నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సీహెచ్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన వైసీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పచ్చిమిర్చి రైతులకు కనీస గిట్టుబాటుధర లేని దయనీయ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఈడ శ్రీనివాసరెడ్డి, చెరుకుపల్లి శ్రీనివాసరెడ్డి, చెరుకుపల్లి మండల కన్వీనర్ మండి వెంకటరెడ్డి, రేపల్లె టౌన్, రూరల్, నిజాంపట్నం మండల కన్వీనర్లు కరేటి శేషగిరి, మేడికొండ అనిల్, వెంకట రాంబాబు, చిత్రా ఓబేదు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 143 మందికి ఉద్యోగాలు

నగరం, మార్చి 28(ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీవెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాలలో నిర్వహించగా ఈ జాబ్‌మేళాకు 17 మల్టీనేషన్ కంపెనీలు హాజరయ్యాయి. జాబ్‌మేళాను కళాశాల కరస్పాండెంట్ బుచ్చయ్యచౌదరి ఆధ్వర్యంలో మ్యాజిక్ బస్సు ఇండియా సహకారంతో నిర్వహించారు. రేపల్లె తాలూకా ఎడ్యుకేషనల్ ఇంప్రూవ్‌మెంట్ వైస్ ఛైర్మన్ నర్రా వెంకటకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఎట్రోఎస్ ప్యాక్, మెడిప్లస్ తదితర ప్రముఖ కంపెనీలు పాల్గొని విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాయి. మేళాలో 350మంది యువతీ, యువకులు పాల్గొనగా 143 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ తెలిపారు.



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఐలవరం గ్రామానికి చెందిన 8 మంది పలు అనారోగ్య కారణాలతో ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందారు. ఆర్థిక సాయం అందించాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబును సంప్రదించగా ఆయన ముఖ్యమంత్రి సహాయనిధికి సిఫారసు చేశారు. సీఎంఆర్ఎఫ్ కార్యాలయం నుంచి వచ్చిన చెక్కులను ఆయా లబ్ధిదారులు కాజా చంద్రమౌళికి రూ.60,557లు, ఉపర్తి కోటేశ్వరరావుకు రూ.57,522, చింతలంక ఖాదర్‌నాథ్ వెంకట్‌కు రూ.42 వేలు, దేవరకొండ నాగలక్ష్మికి రూ.37,142, చిలుకోటి లలితకు రూ.30,786, పరిశ బేబికి రూ.30,028, గుద్దంటి పుష్పకు రూ.27,114, చింతా నాగలక్ష్మికి రూ.13,350లు చెక్కుల రూపంలో రాగా గుంటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే ఆనందబాబుకు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తమ కృతజ్ఞతలు తెలిపారు.

ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ



చీరలను పంపిణీ చేస్తున్న శివప్రసాద్ తదితరులు

రేపల్లె, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా 23వ వార్డు జెండా చెట్టువద్ద షేక్ జమీర్ ఆధ్వర్యంలో మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరై ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి వారి అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. అల్లా దీవెనలతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో మెలగాలని ఆకాంక్షించారు. అనంతరం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ, డొక్కు బుజ్జి, షేక్ ముబీన్, షేక్ గౌస్ పాల్గొన్నారు.

మసీదుల్లో స్వీట్లు...

రేపల్లె, మార్చి 28(ఆంధ్రజ్యోతి) : పవిత్రరంజాన్ పండుగ సందర్భంగా రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అందించిన స్వీట్లను పట్టణంలోని అన్నిమసీదుల్లో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గోగినేని పట్టాభిరామారావు శుక్రవారం అందజేశారు. ఈసందర్భంగా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. హిందూ, ముస్లింలు ఒకరికొకరు ఆప్యాయంగా ఉంటూ ముందుకువెళుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్‌ఖాదర్ బాషా, షేక్ జమీర్, కరిముల్లా, మొహిద్దీన్, షేక్ సుభాని, షేక్ అమీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవే జనసేన పార్టీ లక్ష్యం : మహేష్



సభలో మాట్లాడుతున్న జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు మహేష్

రేపల్లె, మార్చి 28(ఆంధ్రజ్యోతి) : ప్రజలకు సేవలు అందించటమే జనసేనపార్టీ లక్ష్యమని జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు రాసంశెట్టి మహేష్ అన్నారు. రాజేష్ థియేటర్‌లో జనసేన పార్టీ, శంకర్‌కంటి వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మెగా ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శంకర్ కంటి వైద్యులు 92 మంది పేద వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించగా 49 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లకు వైద్యులు నిర్ధారించారని తెలిపారు. వారిలో 28 మందిని పెదకాకాని వద్ద శంకర్ కంటి ఆసుపత్రికి బస్సులో పంపించటం జరిగిందన్నారు. రెండో బ్యాచ్‌లో మరికొందరిని ఆపరేషన్లకు పంపనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మలిశెట్టి సాయి, వడ్డి వెంకటేశ్వరరావు, దేవరపల్లి గురుబ్రహ్మం, దేవగిరి శంకర్, గరికపాటి గిరిధర్, మెండు సుబ్బారావు, ఆళ్ళ సూరిబాబు, పవన్‌కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

గృహాల మధ్య మద్యం షాపులు వద్దని ధర్నా



ధర్నా చేస్తున్న ప్రజలు, సీపీఎం, సీపీఐ నాయకులు

రేపల్లె, మార్చి 28(ఆంధ్రజ్యోతి) : గృహాల మధ్య మద్యం షాపులు ఏర్పాటు చేయవద్దని ప్రజాసంఘాల నాయకులు, స్థానికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘనాయకులు సీహెచ్ మణిలాల్, గొట్టుముక్కల బాలాజీ మాట్లాడుతూ గృహాల మధ్య మద్యం షాపులు ఏర్పాటు చేస్తే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని, ఎక్సైజ్ అధికారులు దృష్టిసారించి మద్యంషాపును ఊరుబయట పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు భాస్కర్‌కిషోర్, బిక్షాలు, సీపీఐ నాయకులు కె.నాగాంజనేయులు, చందోలుగూడెం నివాసులు పాల్గొన్నారు.

చేనేతకు ప్రభుత్వం చేయూత : రాంబాబు

చెరుకుపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత చేనేత కార్మికులకు చేయూతనందిస్తుందని ఆరుంబాక చేనేత సంఘం ప్రెసిడెంట్, ఆప్కో మాజీ డైరెక్టర్ దివి రాంబాబు అన్నారు. ఆరుంబాక చేనేత సహకార ఉత్పత్తి విక్రయ సంఘం లిమిటెడ్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పాలనలో చేనేత రంగం కుదేలైపోయిందని, టీడీపీ ప్రభుత్వం వచ్చాక చేనేతకు పెద్ద పీట వేశారని చెప్పారు. ఆరుంబాక చేనేత సంఘ పరిధిలోని చేనేత కార్మికులకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి భృత్యాన్ని 20 శాతం పెంచి ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కందుల రామ్మోహన్‌రావు, 8 మంది డైరెక్టర్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలపై డిస్కౌంట్

బాపట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకొని అన్నిరకాల ఆప్కో చేనేత వస్త్రాలపై 30 నుంచి 50 శాతం వరకు డిస్కౌంట్ ధరలకు విక్రయిస్తున్నట్లు ఆప్కో అధికారి డి.వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హైదరాబాద్‌కు రిజర్వేషన్ చేసుకోవచ్చు : డీఎం

రేపల్లె, మార్చి 28(ఆంధ్రజ్యోతి) : రేపల్లె నుంచి హైదరాబాద్ వెళ్ళే బస్సులకు సర్వీస్ నెంబర్లు కేటాయించటం జరిగిందని ఆర్టీసీ డీఎం సుఖవాసి సునిల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం రేపల్లె నుంచి సూపర్‌లగ్జరీ రేపల్లె-భట్టిప్రోలు-కొల్లూరు మీదగా బీహెచ్‌ఎల్ వెళ్ళే సర్వీస్, రేపల్లె నుంచి హైదరాబాద్ బీహెచ్ఎల్‌కు వెళ్ళే ఇంద్ర సర్వీస్‌లకు ప్రత్యేక నెంబర్లను కేటాయించటం జరిగిందని, ఆ నెంబర్ల ద్వారా ఆన్‌లైన్‌లో టిక్కెట్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. చెరుకుపల్లి మీదగా హైదరాబాద్ వెళ్ళే బస్సులకు అమర్తలూరులో రిక్వెస్టు స్టేజీగా ఏర్పాటు చేయటమైందన్నారు.

వన్యప్రాణులు.. కనువిందు


నీళ్లు తాగుతున్న చుక్కల జింకలు

వినుకొండటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వినుకొండ సమీపంలోని కండ్రిక బీటు అటవీ ప్రాంతంలో జంతువులు కనువిందు చేస్తున్నాయి. ప్రకృతి సిద్ధంగా ఉన్న నీటి కుంట వద్ద దర్శనమిస్తున్న అడవి జంతువులను చూస్తే ఆశ్చర్యం కలిగించక మానదు. అటవీ శాఖ అధికారి కృష్ణప్రియ ఆదేశాల మేరకు ఎఫ్ఆర్వో 20 రోజుల క్రితం కండ్రిక బీట్‌లోని నీటి కుంటల వద్ద సీసీ కెమెరాలు అమర్చారు. 27న సీసీ ఫుటేజీలను పరిశీలించిన అధికారులకు, కణితి, మనబోతు, చుక్కల దుప్పులు, అడవి పందులు, అడవి కుక్కలు, నెమళ్లతో పాటు వివిధ రకాల పక్షుల వీడియోలు రికార్డు అయ్యాయి.


పురివిప్పి నాట్యమాడుతున్న నెమలి


మనబోతుతో ఉన్న పిల్లలు




రేస్ కుక్క

పేలుళ్ళ ధాటికి.. ఇళ్ళు కూలుతున్నాయ్

దుమ్ముతో పంట పాడవుతోంది.. సిమెంటు కంపెనీలపై ప్రజల ఆగ్రహం


మిరప కాయల పై పడిన దుమ్మును పరిశీలిస్తున్న గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, ఇతర అధికారులు

దాచేపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ప్యాక్టరీకి భూములు ఇస్తే మీ పిల్లలకు ఉద్యోగాలొస్తాయి...మీ గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుంది...వైద్య శిబిరాలు నిర్వహిస్తాం. రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరుస్తాం...తాగు నీటి సమస్య లేకుండా చూస్తాం...అంటూ ప్రజాభిప్రాయ సేకరణలో ఫ్యాక్టరీ యజమానులు అధికారుల ఎదుట గ్రామస్తులకు హామీలు ఇచ్చారు. తీరా ఫ్యాక్టరీ నిర్మాణాలు పూర్తి చేసుకొని ఉత్పత్తులు ప్రారంభించారు. కాని మా పిల్లల ఉద్యోగాల మాట దేవుడెరుగు, మాకు పట్టెడన్నం పెట్టే పంట పొలాలు సిమెంట్ ఫ్యాక్టరీ దుమ్ముధూళితో దెబ్బతింటున్నాయి. మాకు నిలువ నీడనిచ్చే ఇళ్ళు నేల మట్టమయ్యే పరిస్థితి వచ్చింది. మా పంట పొలాలకు సాగు నీరు అందించే కాలువలను పూడ్చి వేశారు. ఇదేమిటని? అడిగితే మా ప్రశ్నలకు బదులు ఇచ్చే వారే కరువయ్యారంటూ తమ గ్రామాలకు వచ్చిన అధికారులకు ప్రజలు గోడు వెళ్ళబుచ్చుకున్నారు. శుక్రవారం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పెదగార్లపాడు గ్రామంలోని చెట్టినాడు సిమెంట్స్ తంగెడ గ్రామంలోని భవ్య సిమెంట్ ఫ్యాక్టరీలను అధికారులు పరిశీలించారు. గురజాల ఆర్డీవో మురళీకృష్ణ పర్యవేక్షణలో హౌసింగ్, మైనింగ్, నీటి పారుదల శాఖ, మైనర్ ఇరిగేషన్, వ్యవసాయ శాఖ, పోలీసు శాఖ, దేవాదాయ శాఖ, మరికొన్ని ఇతర శాఖలతో కలిపి 11 శాఖల అధికారులు తక్కెళ్ళపాడు, పెదగార్లపాడు, తంగెడ గ్రామాల్లోని రైతులను, బ్లాస్టింగ్‌తో ఇళ్ళు దెబ్బతిన్న బాధిత కుటుంబాలను నేరుగా కలసి వారి కష్టాలను విన్నారు. రైతులు మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుమ్ము పంట పొలాల పై పడటంతో చెట్లు ఎదుగుదల తగ్గటం, పండిన కాయల పై దుమ్ము పేరక పోయి నాణ్య లేక పోవటం, నాణ్యత లేని పంటకు ధర లేక పోవటం, తమను ఆర్థికంగా కుంగ దీస్తుందన్నారు. ఇది చాలదన్నంటూ పెద్ద మొత్తంలో పేలుళ్ళు జరపటంతో నివాస గృహాల గోడలు పగుళ్ళిచ్చి స్లాబులు దెబ్బతిని ఇళ్ళు కూలిపోయే పరిస్థితి ఉందని కోరంపల్లి ధనలక్ష్మి, షేక్ గుంటూరు, సోయ యలమందమ్మ, సిద్దాబత్తుల శ్రీను ఆర్డీవోకు కన్నీటి పర్యంతమవుతూ వివరించారు. గత మూడు సంవత్సరాలుగా తాము పడుతున్న బాధలను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు, ఎంపీ కృష్ణ దేవరాయలకు తెలియ జేశామని తెలిపారు. అధికారులు గాని, ప్రజా ప్రతినిధులు గాని మా వంక చూసిన దాఖలాలు లేవని తెలిపారు. ఫ్యాక్టరీలకు భూములు ఇవ్వటమే మేము చేసిన నేరమా? అంటూ వారు అధికారులను నిలదీశారు. గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ సభలో ఇచ్చిన హామీలను నెరవేర్చక పోయినా పర్వాలేదు గాని మాకు నీడనిచ్చే ఇళ్ళను, మాకు పట్టెడన్నం పెట్టే పొలాలను నాశనం చేయవద్దని వారు వేడుకున్నారు. అనంతరం నీటి పారుదల శాఖకు చెందిన కాలువలు ఆక్రమించటం, తక్కెళ్ళపాడు గ్రామ పంచాయతీకి గత ఐదు సంవత్సరాలుగా రూ 70 లక్షలు పన్నులు చెల్లించక పోవటం, అనుమతులు లేకుండా క్రషర్ నిర్మాణం, స్టాకర్ షెడ్డు నిర్మాణాలను కూడా అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మురళీకృష్ణ మాట్లాడుతూ రైతులు, ఆయా గ్రామాల ప్రజలు తెలిపిన వివరాలను క్షేత్ర స్థాయిలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను నమోదు చేశామని, జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో మైనింగ్ ఏడీ ప్రకాష్ కుమార్, హౌసింగ్ ఈఈ బాలాజీ నాయక్, మైనర్ ఇరిగేషన్ డీఈ శ్రీనివాసరావు, నీటి పారుదల శాఖ డీఈ పసుపులేటి ఆదినారాయణ, వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీ కృష్ణ దేవరాయలు, దేవాదాయ శాఖ ఈవో నెమలిరెడ్డి, సీఐ భాస్కరరావు, ఎస్ఐ సౌదర్ రాజన్, టీడీపీ నేతలు పురంశెట్టి పరంజ్యోతి, రామారావు, జనసేన నేతలు అంబటి మల్లి, బూసి నాగేశ్వరరావు, తిరుమలశెట్టి అంకారావు, తక్కెళ్ళపాడు గ్రామ సర్పంచ్ కిష్టంశెట్టి లక్ష్మీనారాయణ, జనసేన మండల కన్వీనర్ పాముల కిషోర్, ఆవుల శివకృష్ణ, కిష్టంశెట్టి పకీరయ్య, ఉలిబండ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.


పెదగార్లపాడు గ్రామంలో భారీ బ్లాస్టింగ్‌కు పగుళ్ళిచ్చిన ఇంటి గోడలను పరిశీలిస్తున్న గురజాల ఆర్డీవో మురళీకృష్ణ తదితరులు

కొత్త చరిత్రకు వేదిక



- పేదరిక నిర్మూలనకు వినూత్నంగా పీ4 కార్యక్రమం
- రాష్ట్రంలోని పేదలకు సంపన్నుల చేయూత
- ఇరువురికి మధ్య అనుసంధానంగా ప్రభుత్వం
- ఉగాది వేడుకల్లోనే పీ4కు సీఎం శ్రీకారం
- వెలగపూడిలో కొలిక్కి వచ్చిన సభ ఏర్పాట్లు
- 11 వేల మందికిపైగా కూర్చుని వీక్షించేలా ఏర్పాట్లు
- సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం ప్రత్యేక బస్సులు

మంగళగిరి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది సంబరాలకు రాజధాని ప్రాంతంలోని వెలగపూడి ముస్తాబైంది. ఈ వేడుకలకు తోడు రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించే సరికొత్త విధానం పీ4కు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఈ రెండింటిని కలిపి ఒకే ఉత్సవంగా నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లు కొలిక్కి వచ్చాయి. రాష్ట్రంలో పేదరికాన్ని సమూలంగా నిర్మూలించి 2047 నాటికి స్వర్ణాంధ్రను సాకారం చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పీ4 విధానానికి రూపకల్పన చేశారు. రాష్ట్ర సామాజిక గతిని మలుపుతిప్పే ఈ చరిత్రాత్మక కార్యక్రమాన్ని ఆదివారం సీఎం ప్రారంభిస్తున్నారు. ప్రభుత్వం, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించే లక్ష్యంతో పీ4 కార్యక్రమాన్ని అమలుచేయనున్నారు. ఈ విధానంలో ప్రభుత్వం ప్రత్యేకంగా పేదవారికి ఎలాంటి రుణాలు, నిధులు ఇవ్వదు. కానీ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు సంపన్న కుటుంబాలు రాష్ట్రంలో వెనుకబడిఉన్న పేద కుటుంబాలను ఆదుకొనేలాగా, తద్వారా సామాజికంగా మార్పు తీసుకొచ్చేలాగా ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. ఇందులో దాతలను మార్గదర్శులుగా, లబ్ధిదారులను బంగారు కుటుంబాలుగా పిలుస్తారు. ఈ ఇరువురి మధ్య ప్రభుత్వం ఓ సంధానకర్తగా వ్యవహరిస్తుంది. దీనికోసం పీ4 సొసైటీలను రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గస్థాయిలో ఏర్పాటు చేస్తారు. పేదరికం లేని రాష్ట్రం కోసం ఇదో విప్లవాత్మకమైన ముందడుగు అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల వ్యాఖ్యానించారు. ఈ విధానం దేశానికే ఓ రోల్‌మోడల్‌గా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రత్యేకంగా వేదిక ముస్తాబు

వెలగపూడిలోని సెక్రటేరియెట్ వెనుకవైపు ప్రత్యేకంగా ముస్తాబు చేసిన ప్రాంగణంలో ఉగాది, పీ4 కార్యక్రమం ప్రారంభ వేడుకలను 30వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారు ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకల్లా ప్రాంగణం వద్దకు చేరుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమాల నిర్వహణకు ప్రాంగణంలో రెండు షెడ్లు నిర్మించారు. ప్రధానమైన షెడ్డులో 11 వేలమందికిపైగా కూర్చొని కార్యక్రమాలను వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి స్వయం సహాయక సంఘాలు, విద్యార్థులు, రైతులు, ఉపాధి కూలీలను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. సమీప జిల్లాలైన ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి ఏడు వేలమందిని, సుదూర జిల్లాల నుంచి సుమారు 5 వేలమందిని తరలించేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచుతున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వారికి వసతి, భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. దగ్గరి ప్రాంతం వారికి కూడా అల్పాహారం, భోజన సదుపాయాలను కల్పిస్తున్నారు. సభా ప్రాంగణంలో ఖాళీగా ఉన్న ప్రాంతాన్ని పార్కింగ్ కోసం కేటాయించారు.


ప్రధాన వేదిక

బాపట్ల-చీరాల మధ్య.. టూరిజం సర్క్యూట్

- బ్లూఫ్లాగ్ బీచ్‌గా సూర్యలంక
- అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యాటక కేంద్రం
- పర్యాటకశాఖ మంత్రి దుర్గేష్


అడవిపల్లెపాలెంలో పర్యటిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, కొండయ్య

బాపట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ ప్రమాణాలతో సూర్యలంక పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. బాపట్ల మండలం అడవిపల్లెపాలెం వీ రిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన వాటర్‌పార్క్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బ్లూఫాగ్‌బీచ్‌గా సూర్యలంక బీచ్‌ను తీర్చిదిద్దుతామన్నారు. పర్యాటకుల భద్రత, అంతర్జాతీయప్రమాణాలకు పెద్దపీట వేస్తామని చెప్పారు. బాపట్ల-చీరాల మధ్యలో టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు. కేంద్రప్రభుత్వం స్వదేశీ దర్శన్ స్కీమ్ 2.0 ద్వారా మంజూరైన 97.52 కోట్ల రూపాయల నిధులతో సూర్యలంకబీచ్‌లో అధునాతన సదుపాయాలు కల్పించి సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఇప్పటికే పీపీపీ విధానంలో పెట్టుబడులకు పలువురు ఇన్వెస్టర్లకు ఆహ్వానం పలికామన్నారు. పీపీపీ విధానంలో వీ రిసార్ట్స్ ఏర్పాటు చేయటం సంతోషదాయకమన్నారు.

కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేతృత్వంలో రాష్ట్రంలో పర్యాటకరంగం అద్భుతమైన ప్రగతి సాధిస్తుందన్నారు. అందుకు నిదర్శనంగా కేంద్ర పర్యాటక, సాంస్కృతికశాఖా మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సూర్యలంకబీచ్‌కు 97కోట్లు మంజూరు చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఈ నిధులతో సూర్యలంకబీచ్‌లో పర్యావరణ విద్య, పరిశుభ్రత, టాయిలెట్స్, బట్టలు మార్చుకునే గదులు, వ్యర్థాల నిర్వాహణకు విధానం తదితర అంశాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. పర్యావరణాన్ని కాపాడుతూనే పర్యాటకానికి పెద్దపీట వేస్తామన్నారు. తద్వారా బాపట్ల-చీరాల నియోజకవర్గాలలో భారీఎత్తున ఉపాధి కల్పించనున్నామన్నారు. పర్యాటక రంగానికి ఈ ప్రాంతాలు ఉపయోగపడేవని ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాలలో బాపట్ల,చీరాల ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఎం.ఎం.కొండలు తెలిపినట్లు చెప్పారు. వాళ్ళఅడిగిన 15రోజుల్లోనే సూర్యలంకబీచ్ అభివృద్ధికి భారీఎత్తున నిధులు రావటం జరిగిందన్నారు. ఇందుకు కేంద్రగ్రామీణాభివృద్ధి సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఇతోధికంగా కృషి చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో బాపట్ల, చీరాల ఎమ్మెల్యేలు నరేంద్రవర్మ, కొండయ్య, బాపట్లఅర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ సలగల రాజశేఖరబాబు, గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ రాజశేఖర్, జనసేన సీనియర్ నాయకులు అమంచి స్వాములు, నామన వెంకటశివన్నారాయణ, వీ రిసార్ట్స్ అధినేత సందీప్, భాస్కర్ పాల్గొన్నారు.

రేపు సాహితీ వసంతోత్సవం

గుంటూరు(తూర్పు), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను పురస్కరించుకుని సాహితీ సమైక్య, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 30న ఆదివారం స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సాహితీ వసంతోత్సవం నిర్వహిస్తున్నట్లు సమైఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ తెలిపారు. భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో శుక్రవారం సమావేశంలో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కవి, గజల్ రచయిత రసరాజుకు సాహితీ పురస్కారం, ప్రముఖ సినీ నటుడు కేదార్‌శంకరకు ఆత్మీయ సత్కారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పంచాంగ శ్రవణం, విష్ణు సహస్రనామ పారాయణం, సాహితీ సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్, రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ ముఖ్య కార్యదర్శి ఎమ్‌టీ కృష్ణబాబు,కమిషనర్ శ్రీనివాసులు ఈ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి రామచంద్ర రాజు, సమైఖ్య కార్యదర్శి రాము పాల్గొన్నారు.

బెల్ సరే.. మరి నీళ్ళెలా..?

(3వ పేజీ తరువాయి)

కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులే చందాలు వేసుకుని మినరల్ వాటర్ క్యాన్లను కొనుగోలు చేసి విద్యార్థులకు అందిస్తున్నారు. మరికొందరు విద్యార్థులు తప్పనిసరి పరిస్థితుల్లో పాఠశాల బయట దొరికే నీటిని కొనుగోలు చేసి తాగుతున్నారు. పాఠశాలల్లో బోధన గురించి పక్కన పెడితే విద్యార్థులకు కనీస అవసరమైన నీటి గురించి ఎవరూ పట్టించుకోవడంలేదు. మధ్యాహ్న భోజనం సమయంలో విద్యార్థులు ఇళ్ల నుంచి తెచ్చుకున్న నీటినే వినియోగిస్తున్నారు. ఆ నీరు అయిపోతే విద్యార్థులు బయటకు వెళ్లి కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. లేదంటే ఇంటికి వెళ్లే వరకు దాహార్తితో అల్లాడిపోవాల్సిందే. ఈ పరిస్థితుల్లో ఉదయం 10, 11, 12 గంటలకు వాటర్ బెల్‌ను ఎలా అమలు చేయాలని ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు.

రూ.లక్షలతో ఏర్పాటు.. ఫలితం శూన్యం

2020లో నాడు-నేడు పథకంలో విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించేందుకు పాఠశాలల్లో ప్రత్యేకంగా ఆర్వో ప్లాంట్లను మంజూరు చేశారు. ఒక్కో వాటర్ ప్లాంట్ 50,000 లీటర్లు లక్ష, 2 లక్షలు లీటర్ల సామర్థ్యంతో కొనుగోలు చేశారు. సరఫరా, బిగించడం, నిర్వహణ కోసం ఒక్కో పాఠశాలకు రూ.2 లక్షల నుంచి రూ5 లక్షల వరకు ఖర్చు చేసినట్లు సమాచారం. అయితే ఏజెన్సీలు అనేక చోట్ల ప్లాంట్లు పంపిణీ చేసి వాటిని బిగించలేదు. వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు షెడ్డు నిర్మాణం చేయకుండానే యంత్రాలను తీసుకు వచ్చి పాఠశాలల్లో పెట్టారు. తర్వాత షెడ్డు నిర్మించినా వాటిని బిగించకుండా మూలన పడేశారు. మరి కొన్ని చోట్ల నిర్వహణా లోపంతో వాడుకలోనికి తీసుకురాలేదు. ఫలితంగా పాఠశాలల్లో శుద్ధ జల యంత్రాలు ఎందుకూ పనికిరాకుండా ఉన్నాయి. మరమ్మతులపై పాఠశాలల కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చిన పట్టించుకునే వారే లేరు. ప్రభుత్వం తాజాగా ఆర్వో ప్లాంట్ల విషయాన్ని తెలుసుకుని స్కూల్ గ్రాంట్ నిధులను విడుదల చేయడంతో కొన్ని పాఠశాలల్లో మాత్రం ఆర్వో ప్లాంట్లు అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన పాఠశాలల్లో మాత్రం పరిస్థితి షరామామూలుగానే ఉంది.




రేపల్లె 3వ వార్డులోని మున్సిపల్ హైస్కూల్లో పనిచెయ్యని ఆర్వోప్లాంట్, పిడుగురాళ్ల జడ్పీ పాఠశాలలో ఆర్ఓ ప్లాంట్ పనిచేయకపోవడంతో ఇంటి నుండి బాటిల్స్ తెచ్చుకుంటున్న బాలికలు

ఆర్-5 జోన్ లబ్ధిదారులకు ప్రత్యామ్నాయ స్థలాలు

గుంటూరులో 216 ఎకరాలు

ఎన్టీఆర్ జిల్లాలో 80 ఎకరాలు గుర్తింపు

7056 మంది అనర్హుల గుర్తింపు



గుంటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో ఆర్5 జోన్ ఒకటి ఏర్పాటు చేసి లబ్ధిదారులు, భూములు ఇచ్చిన రైతుల మధ్యన వైసీపీ కుంపటి పెట్టగా ఆ సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రత్యామ్నాయ స్థలాలు ఇచ్చేందుకు టీడీపీ ప్రభుత్వం సిద్ధమైంది. తాము అధికారంలోకి రాగానే ఆర్5 జోన్‌ని రద్దు చేయడంతో పాటు లబ్ధిదారులకు స్థానికంగా నివాసం ఉంటున్న సమీపంలోనే ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రతిపక్షంలో ఉండగా సీఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఆ మేరకు గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లను భూములను గుర్తించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా ఇప్పటికే గుంటూరు జిల్లా కలెక్టర్ లబ్ధిదారులకు అవసరమైన భూములను గుర్తించారు. ఎన్టీఆర్ జిల్లాలోనే పెండింగ్‌లో ఉండటంతో తక్షణమే ఇళ్ల స్థలాలకు అవసరమైన భూములను గుర్తించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది.

వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి రాజధానికి వెలుపల ఉన్న నియోజకవర్గాల్లో ఇళ్ల స్థలాల కోసం పేదలను ఎంపిక చేశారు. అయితే వాళ్లకి స్థానికంగానే ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా సీఆర్‌డీఏ చట్టాన్ని సవరించి రాజధానిలో వేర్వేరు గ్రామాల్లో సెంటు భూములను ఇచ్చేందుకు ఆర్5 జోన్‌ని ఏర్పాటు చేశారు. ఇందుకోసం వెంకటపాలెంలో సభ కూడా నిర్వహించారు. ఆగమేఘాలపై లేఅవుట్ల అభివృద్ధి పేరుతో రూ. వందల కోట్లు ఖర్చు చేశారు. లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు కూడా ఇచ్చి రిజిస్ట్రేషన్ చేశారు. అయితే దీనిని కోర్టులు నిలిపేశాయి. ఎన్టీఆర్ జిల్లాలో 27,031 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. అలానే గుంటూరులో 23,761 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి హడావిడిగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అమరావతి మాస్టర్‌ప్లాన్‌కు విరుద్ధంగా చేపట్టిన ఈ కుట్రని అప్పట్లోనే రాజధానికి భూములు ఇచ్చిన రైతులు వ్యతిరేకించారు. మాస్టర్‌ప్లాన్ ప్రకారం ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని కోరినా అప్పటి వైసీపీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించింది.

టీడీపీ ప్రభుత్వం గత ఏడాది అధికారంలోకి వచ్చిన తర్వాత మొత్తం 50,792 మంది లబ్ధిదారుల అర్హతలను పునర్‌పరిశీలన చేయించింది. గుంటూరులో 23,761 మందిలో 4,323(11 డూప్లికేట్‌లు కలిపి) అనర్హులుగా తేల్చారు. ఎన్టీఆర్ జిల్లాలో 27,031 మంది లబ్ధిదారులకు 3,183 మంది అనర్హులుగా నిర్ధారించారు. అనర్హుల పేర్లను తొలగించిన తర్వాత ఎన్టీఆర్ జిల్లాలోని 23,848 మంది లబ్ధిదారులకు 265 ఎకరాల భూమి అవసరం అవుతుందని లెక్కించారు. అలానే గుంటూరు జిల్లాలో అనర్హుల ఏరివేత అనంతరం 19,438 మందికి 216 ఎకరాల భూమి అవసరమని నిర్ణయానికి వచ్చారు. ఇప్పటికే గుంటూరు జిల్లాలో లబ్ధిదారులకు అవసరమైన భూములను వారి నివాస ప్రాంతాలకు సమీపంలోనే గుర్తించారు. ఎన్టీ ఆర్ జిల్లాలో 265 ఎకరాలకు కేవలం 80 ఎకరాలు మాత్రమే గుర్తించారు. ఇంకా 185 ఎకరాలు ఎన్టీఆర్ జిల్లాలో గుర్తించాల్సి ఉన్నది. గుర్తించిన భూములను త్వరలోనే సేకరించి లబ్ధిదారులకు అందజేయాలని కలెక్టర్లను ప్రభుత్వం తాజాగా ఆదేశించింది.



సీఎం పర్యటన కోసం సిద్ధం చేస్తున్న ప్రాంగణ పనులను పరిశీలిస్తున్న టీడీపీ శ్రేణులు

సీఎం పర్యటన పనుల్లో తెలుగు తమ్ముళ్లు

ముమ్మరంగా సాగుతున్న ఏర్పాట్లు

చినగంజాం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు ఏప్రిల్ ఒకటిన చినగంజాం మండలం, పెద్దగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డి, కొత్తగొల్లపాలెంలో పేదల సేవ ఫెన్షన్ పంపిణీలో పాల్గొనేందుకు వస్తున్న తరుణంలో ఏర్పాట్ల కార్యక్రమంలో తెలుగుతమ్ముళ్లు నిమగ్నమయ్యారు. అధికారులతో కలసి వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. సీఎం పర్యటన సందర్భంగా గ్రామాన్ని సుందంగా తీర్చి దిద్దుతున్నారు. ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామంలోని ప్రజలకు పూర్తిస్థాయి వసతులు కల్పించాలన్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాలతో ఇటు అధికారులతోపాటు, పార్టీ శ్రేణులు అలుపెరగని విధంగా కార్యక్రమాలు నిర్వహణలో భాగస్వాములు అయ్యారు. మండల పార్టీ అధ్యక్షుడు పొదవీరయ్య, తెలుగు రైతు రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డిల నేతృత్వంలో పనులు చురుగ్గా సాగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హెలిప్యాడ్, ప్రజావేదిక ప్రాంగణ పనులను పర్యవేక్షించారు. అధికారులు బృందాలుగా ఏర్పడి గ్రామంలోని ప్రజల సమస్యలను ఇంటింటికీ తిరిగి సేకరిస్తున్నారు.

విద్యార్థులు భవిష్యత్‌పై దృష్టి సారించాలి



విద్యార్థినికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న న్యాయాధికారి సుధ, డా.బాబూరావు, ప్రిన్సిపాల్ నాగమణి

చీరాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో చెడు మార్గాలకు దూరంగా ఉండి ఉన్నత భవిష్యత్‌పై దృష్టి సారించాలని న్యాయాధికారి సుధ, గుండె వైద్య నిపుణుడు డాక్టర్ బాబూరావు, బాపట్ల బాపట్ల ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ నాగమణి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా. మురళీ అధ్యక్షతన వార్షికోత్సవం వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా చట్టాలపై అవగాహనతో పాటు, ప్రస్తుత పరిస్థితులను న్యాయాధికారి సుధ వివరించారు. అలాగే అర్థశాస్త్రం, రాజనీతి శాస్త్రం, చరిత్ర, గణిత శాస్త్రం, క్రీడలు విభాగాలలో ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అతిథులు అందజేశారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ స్నేహలత, లలిత కుమారి, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలో విజేతగా నిలవాలి



జాతీయస్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టు

పంగులూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో క్రీడా నైపుణ్యం చాటి విజేతగా నిలవాలని తహసీల్దార్ పి.సింగారావు అన్నారు. పంగులూరు ఎంఎస్ఆర్ అండ్ బీఎన్ఎం జూనియర్ కళాశాలలో శుక్రవారం సాయంత్రం ఖోఖో రాష్ట్ర పురుషుల జట్టు శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మేకల జయరామిరెడ్డి జ్ఞాపకార్థం సీతారామిరెడ్డి, ఉషారెడ్డి సమకూర్చిన క్రీడా దుస్తులను తహసీల్దార్ క్రీడాకారులకు అందచేశారు. కార్యక్రమంలో కోచ్ డీఎల్ రెడ్డి, మేనేజర్ గురుప్రసాద్ పాల్గొన్నారు. జట్టు శిక్షణకు సహకారం అందించిన గ్రామస్థులకు ధన్యవాదాలు తెలిపారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర పురుషుల జట్టు

ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 4 వరకు ఒడిశా రాష్ట్రంలోని పూరి పట్టణంలో జరిగే జాతీయ స్థాయి పురుషుల ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టును అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శుక్రవారం ప్రకటించారు. ఈ జట్టులో కె.రామ్మోహన్, ఎం.ఫణికుమార్, కె.మహేష్, ఎం.ప్రసాద్, ఎ.వీరాంజనేయులు (ప్రకాశం), జె.నితేష్, వి.భానుప్రసాద్, పి.నరసయ్య (విజయనగరం), జి.సంతోష్ (అనంతపురం), ఎం.సాయివెంకట్(తూ.గో), హెచ్.రాజేష్ (చిత్తూరు), కె.ప్రవీణ్ (శ్రీకాకుళం), బి.కిరణ్ (విశాఖ), వైవర్షిత్ ముకుందయాదవ్ (కృష్ణ), స్టాండ్ బైగా జి.నాగ వెంకటశివ (ప్రకాశం), హరిప్రసాద్ (కడప) పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా కేఆర్‌కే కళాశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మోహనరావు

అద్దంకిటౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల 41వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం కళాశాలలోని ఆడిటోరియంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీ మోహనరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి అధ్యాపకులు ప్రసంగించారు. విద్యాలో ప్రతిభ కనబరిచిన, పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు, బహుమతులను అందజేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకుడు డి. రాజశేఖర్, డాక్టర్ సుశీలమ్మ, ఇతర విభాగాల అధ్యపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పంగులూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పంగులూరులో శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ గోరంట్ల అనిల్‌కుమార్ తెలిపారు. విద్యుత్ నూతన లైన్‌ల నిర్మాణంలో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అద్దంకి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా పద్మావతి


- వైస్ చైర్మన్‌గా కాపు సామాజికవర్గానికి కేటాయించే అవకాశం
- వరుసగా మూడోసారి కూడా మహిళకే
- వ్యవసాయ కుటుంబం, కూరగాయల సాగుదారులు కావడంతో అన్నగారి సంత గాడిలో పడుతుందన్న ఆశలో రైతులు

అద్దంకి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా వరగాని పద్మావతిని ప్రభుత్వం ప్రకటించింది. అద్దంకి ఏఎంసీ చైర్‌పర్సన్ ఎస్సీ మహిళకు కేటాయించడంతో కొరిశపాడు మండలం పి.గుడిపాడుకు చెందిన టీడీపీ సీనియర్ నేత మందా నాగేశ్వరరావు కుమార్తె, వరగాని ప్రసన్నకుమార్ సతీమణి పద్మావతిని నియమించారు. వైస్ చైర్మన్‌గా అద్దంకి పట్టణానికి చెందిన కాపు సామాజికవర్గానికి చెందిన సీనియర్ నేతకు కేటాయించనున్నట్లు తెలుస్తుంది. డైరెక్టర్‌ల జాబితా శనివారం ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. అద్దంకి ఏఎంసీ పరిధిలో అద్దంకి, కొరిశపాడు, పంగులూరు మండలాలు ఉన్నాయి. డైరెక్టర్‌ల కేటాయింపులో అన్ని సామాజిక వర్గాలను, అన్ని మండలాలకు ప్రాధాన్యం ఉండేలా జాబితా ప్రకటించే అవకాశం ఉంది. ప్రసన్నకుమార్, పద్మావతి కుటుంబం వ్యవసాయమే ప్రధాన జీవనం కావడంతో పాటు కూరగాయల సాగు ఎక్కువగా చేస్తుంటారు. ఈ నేపథ్యంలో అద్దంకి, మేదరమెట్లలో గత దశాబ్ద కాలంగా నిర్వహిస్తున్న అన్నగారి సంతకు మరలా పూర్వ వైభవం వస్తుందనే ఆశను రైతులు వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్‌లు ప్రారంభించిన తరువాత వరుసగా మూడో సారి కూడా మహిళకే దక్కింది. గత వైసీపీ హయాంలో తొలుత బీసీ మహిళకు కేటాయించగా పంగులూరు మండలం అలవలపాడుకు చెందిన భువనేశ్వరికి దక్కింది. రెండోసారి ఎస్సీ మహిళకు కేటాయించడంతో కొరిశపాడు మండలం మేదరమెట్లకు చెందిన జజ్జర ఈశ్వరమ్మకు దక్కింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఎస్సీ మహిళకే దక్కింది. దీంతో వరుసగా మూడు సార్లు మహిళలు అద్దంకి ఏఎంసీ చైర్‌పర్సన్‌లు అయ్యారు.



అద్దంకి వ్యవసాయమార్కెట్ కమిటీ కార్యాలయం

రైతులకు మేలు జరిగేలా కృషి



విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తమ కుటుంబంపై నమ్మకంతో అప్పగించిన పదవికి న్యాయం చేస్తాను. రైతులకు మేలు జరిగేలా కృషి చేస్తాను. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అద్దంకి, మేదరమెట్లలో ప్రారంభించిన అన్నగారి సంతకు పూర్వ వైభవం వచ్చే విధంగా కృషి చేస్తాను.

\- వరగాని పద్మావతి
అద్దంకి ఏఎంసీ చైర్‌పర్సన్

పేదల సేవకే తెలుగుదేశం ఆవిర్భావం

- ఎన్టీఆర్ అంటే ఒక చరిత్ర, ఒక శక్తి
- గ్రామ గ్రామాన టీడీపీ జెండా ఎగురవేయాలి
- ఆశయాలను కొనసాగిస్తున్న చంద్రబాబు
- ఎమ్మెల్యే ఏలూరి



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు

పర్చూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పేదలకు సేవ చేసేందుకే స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారని తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం ఒక చరిత్ర అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. టీడీపీ అవిర్భావ వేడుకలను శుక్రవారం పురస్కరించుకొని ఆయన ప్రసంగించారు. ఎన్టీఆర్ అంటే ఒక చరిత్ర, ఒక శక్తి అన్నారు. టీడీపీ అవిర్భావంతో రాష్ట్రంలో నూతన అధ్యయనం మొదలైందన్నారు. మహానుభావుడు ఎన్టీఆర్ రాజకీయం అంటే అధికారం అనుభవించటం కాదని, ప్రజలకు సేవ చేయడమని దేశ రాజకీయాలలో సంక్షేమ పాలన నేర్పారని ఏలూరి కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా చంద్రబాబు చేస్తున్న కృషి వెలకట్టలేనిదన్నారు. కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, పొట్టి శ్రీరాములు, అంబేడ్కర్, జ్యోతిబాపూలే వంటి మహాశయుల స్ఫూర్తితో 1982లో పార్టీని నందమూరి తారక రామారావు ప్రకటించారని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలు కేవలం ఓటర్లగా మిగిలిపోకుండా రాజకీయాలను శాసించే స్థాయికి ఎదగాలని ఇటు పార్టీలోనూ, అటు పాలనలోనూ పదవులు ఇచ్చారని వారి వారసత్వాన్ని సీఎం చంద్రబాబు నేడు కొనసాగిస్తున్నారన్నారు. ఎన్టీఆర్ అశయాలను చంద్రబాబు ముందుకు తీసుకెళ్తున్నారన్నారు.

■ ముఖాముఖి

పేదల సొంతింటి కల సాకారానికి చర్యలు

శ్రీనివాసరావు, చీరాల హౌసింగ్ డీఈ



నిరాశ్రయులకు, నిరుపేదలకు సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తున్నట్లు చీరాల హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు ఆంధ్రజ్యోతితో ముఖాముఖిలో చెప్పారు.

ప్రశ్న : సొంతిల్లు లేని వారికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటి ?

జవాబు : ప్రతిపేదకూ సొంతిల్లు నిర్మించుకునేందుకు గతం కంటే నగదు పెంచి రూ.2.50 లక్షలను ప్రభుత్వం అందజేస్తుంది.

ప్ర : గతంలో నిలిచిన నిర్మాణాల పరిస్థితి ఏమిటి ?

జ : గతంలో నిలిచిన నిర్మాణాలకు పూర్తి చేసేందుకు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75వేలు అందిస్తున్నాం. అలాగే గతంలో లబ్ధిదారులకు అందాల్సిన నగదును సకాలంలో అందిస్తున్నాం.

ప్ర : తాజాగా మంజూరు చేస్తున్నారా?

జ : వేటపాలెం మండలం వరకు ఇప్పటికే సర్వే నిర్వహించి 591 అర్జీలు స్వీకరించి ఆన్‌లైన్ చేశాం. త్వరలోనే అప్రూవల్ జరుగుతాయి. ఇంకా అర్హులున్నా మంజూరుకు సిద్ధం చేస్తాం.

ప్ర : మరుగుదొడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయా ?

జ : ఇల్లు నిర్మించుకుంటున్న ప్రతి లబ్ధిదారుకీ మరుగుదొడ్డి నిర్మాణానికి సూచనలు చేస్తున్నాం. ఇంటితో సంబంధం లేకుండా అదనంగా రూ.12 వేలు అందిస్తున్నాం. కానీ తప్పనిసరిగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 90 రోజులు పని దినాలు ఉండేలా చూసుకోవాలి.

అందరి సంతోషం కోసమే పవిత్ర రంజాన్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం(చీరాల), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రాంత ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ముస్లింలు పవిత్ర రంజాన్ పండుగను నిర్వహిస్తారని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మండల పరిధిలోని దేశాయిపేట సుబహాన్‌నగర్‌లో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ నియమ నిష్టలతో, అత్యున్నత పవిత్రంగా ఉపవాస దీక్షలు, ఖురాన్ పఠనం చేస్తూ అందరి శాంతని కోరుకుంటారని అన్నారు. ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే అందరికీ వడ్డించి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ఇమామ్‌లు, ముస్లిం మతపెద్దలు, ముస్లిం ప్రతినిధులు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో గ్రామాలలో వసతులు

డ్వామా పీడీ విజయలక్ష్మి



మాట్లాడుతున్న డ్వామా పీడీ విజయలక్ష్మి

అద్దంకిటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు సుస్థిర ఆస్తులను ఏర్పాటుకు అవకాశం కలుగుతుం దని డ్వామా పీడీ ఏవీ విజయలక్ష్మి అ న్నారు. శుక్రవారం అద్దంకి ఎంపీడీవో కా ర్యాలయం వద్ద 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన ప్రజావేదిక కార్యక్రమాన్ని ఎంపీడీవో బత్తిన సింగయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభం కావాల్సిన సభను మధ్యాహ్నం నుంచి ప్రారంభమై సాయంత్రం వరకు ప్రజా వేదిక నిర్వహించారు. దీంతో ఆయా గ్రామాల నుంచి సమస్యలను ప్రజా వేదికలో తెల్పియజేసేందుకు ఎవరూ హాజరు కాలేదు. దీంతో ప్రజా వేదిక సభలో కేవలం అధికారులతో పాటు ఎన్ఆర్ఈజీఎస్ టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో మమ అనిపించారు. గ్రామాలలో జరిగిన వివిధ పనులు, లోపాలను సామాజిక తనిఖీ సిబ్బంది వివరించారు. మస్టర్‌లో సంతకాలు, వేలిముద్రలు లేకుండా నగదు చెల్లింపులపై, పండ్ల తోటల పెంపకంలో తొలగించిన మొక్కలపై పీడీ ప్రశ్నించారు. అద్దంకి మండలంలో 2023-24 సంవత్సారానికి సంబంధించి 834 పనులకు రూ.10.98 కోట్ల పనులు చేసినట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో మస్టర్‌లలో సంతకాలు లేకుండా వేతనాలు ఇవ్వ డంపై ప్రశ్నించడంతో పా టు రికరీకి ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో శోభన్‌బాబు, ఏపీడీ కోటయ్యానాయక్, ఎస్ఆర్‌పీ అప్పారా వు, ఏపీవో గాయత్రిదేవి, ఈసీ నాగరాజు, ఏఈ హనుమంతరావు టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

మేదరమెట్ల : గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధిపనులు చేపట్టాల ని డ్వామా పీడీ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని 2023-24 సంవత్సరాలలో జరిగిన ఉ పాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమానికి విజయలక్ష్మి హాజరయ్యా రు. గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ ప నుల సమగ్ర వివరాలను ఆడిట్ అధికారులు తెలిపారు. అనంతరం పీడీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 15 నుంచి 20 పంట కుంటలు నిర్మించాలని ఆదేశించా రు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు తుళ్లూరి వెంకటరమణ, ఎంపీడీవో ఆర్ రాజ్యలక్ష్మీ, పీఆర్ ఏఈ ప్రసాద్, బీపీవో సోబన్‌బాబు, క్వాలిటీ కంట్రోలర్ సతీష్, ఏపీవో కోటేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్ సరే! మరి నీళ్లు ఎలా

(3వ పేజీ తరువాయి)

కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులే చందాలు వేసుకుని మినరల్ వాటర్ క్యాన్లను కొనుగోలు చేసి విద్యార్థులకు అందిస్తున్నారు. మరికొందరు విద్యార్థులు తప్పనిసరి పరిస్థితుల్లో పాఠశాల బయట దొరికే నీటిని కొనుగోలు చేసి తాగుతున్నారు. పాఠశాలల్లో బోధన గురించి పక్కన పెడితే విద్యార్థులకు కనీస అవసరమైన నీటి గురించి ఎవరూ పట్టించుకోవడంలేదు. మధ్యాహ్న భోజనం సమయంలో విద్యార్థులు ఇళ్ల నుంచి తెచ్చుకున్న నీటినే వినియోగిస్తున్నారు. ఆ నీరు అయిపోతే విద్యార్థులు బయటకు వెళ్లి కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. లేదంటే ఇంటికి వెళ్లే వరకు దాహార్తితో అల్లాడిపోవాల్సిందే. ఈ పరిస్థితుల్లో ఉదయం 10, 11, 12 గంటలకు వాటర్ బెల్‌ను ఎలా అమలు చేయాలని ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు.

రూ.లక్షలతో ఏర్పాటు.. ఫలితం శూన్యం

2020లో నాడు-నేడు పథకంలో విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించేందుకు పాఠశాలల్లో ప్రత్యేకంగా ఆర్వో ప్లాంట్లను మంజూరు చేశారు. ఒక్కో వాటర్ ప్లాంట్ 50,000 లీటర్లు లక్ష, 2 లక్షలు లీటర్ల సామర్థ్యంతో కొనుగోలు చేశారు. సరఫరా, బిగించడం, నిర్వహణ కోసం ఒక్కో పాఠశాలకు రూ.2 లక్షల నుంచి రూ5 లక్షల వరకు ఖర్చు చేసినట్లు సమాచారం. అయితే ఏజెన్సీలు అనేక చోట్ల ప్లాంట్లు పంపిణీ చేసి వాటిని బిగించలేదు. వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు షెడ్డు నిర్మాణం చేయకుండానే యంత్రాలను తీసుకు వచ్చి పాఠశాలల్లో పెట్టారు. తర్వాత షెడ్డు నిర్మించినా వాటిని బిగించకుండా మూలన పడేశారు. మరి కొన్ని చోట్ల నిర్వహణా లోపంతో వాడుకలోనికి తీసుకురాలేదు. ఫలితంగా పాఠశాలల్లో శుద్ధ జల యంత్రాలు ఎందుకూ పనికిరాకుండా ఉన్నాయి. మరమ్మతులపై పాఠశాలల కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చిన పట్టించుకునే వారే లేరు. ప్రభుత్వం తాజాగా ఆర్వో ప్లాంట్ల విషయాన్ని తెలుసుకుని స్కూల్ గ్రాంట్ నిధులను విడుదల చేయడంతో కొన్ని పాఠశాలల్లో మాత్రం ఆర్వో ప్లాంట్లు అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన పాఠశాలల్లో మాత్రం పరిస్థితి షరామామూలుగానే ఉంది.



క్లూస్ టీం సహకారంతో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

చీరాలలో భారీ చోరీ

- ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో దొంగిలించిన దుండగులు
- సమీపంలో రైల్వే ట్రాక్, రాత్రిళ్లు జన సంచారం లేకపోవడంతో నేరస్థులకు తేలికగా పని
- సుమారు 25 సవర్ల బంగారు ఆభరణాలు మాయం?
- క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

చీరాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : విఠల్ నగర్‌లో భారీ చోరీ జరిగింది. దీంతో ఆ ప్రాంతంలో ప్రజల్లో భయాందోళన నెలకొంది. వివరాల్లోకి వెళితే ఆ ప్రాంతానికి చెందిన తిరుమలశెట్టి రజనికి ఇరువురు కుమారులు. ఒకరు హైదారాబాద్‌లో, మరొకరు బెంగళూరులో ఉద్యోగాలు చేస్తున్నారు. ఈక్రమంలో సుమారు వారం కిందట బెంగళూరులో ఉంటున్న కుమారుని వద్దకు రజని వెళ్లారు. అయితే రెక్కీ నిర్వహించిన గుర్తుతెలియని వ్యక్తులు, ఇంటి యజమాని లేకపోవడంతోపాటు ఎదురుగా రైల్వే ట్రాక్ ఉండడం, రాత్రిళ్లు అటువైపు జనసంచారం తక్కువగా ఉండడంతో చోరీకి అవకాశం కలిసి వచ్చింది. ఈక్రమంలో అర్ధరాత్రి తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను దొంగిలించి పరారయ్యారు. దీంతో స్థానికుల నుంచి సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు ఇంటి యజమానికి సమాచారం ఇచ్చారు. ఈక్రమంలో సుమారు 25 సవర్ల బంగారు ఆభరణాలు పోయినట్లు అనుమానిస్తున్నారు. క్లూస్ టీం సహకారంతో ఆధారాలను సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవగాహనతోనే నేరాలకు అడ్డుకట్ట - వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు

ఇప్పటికే ఉన్నతాధికారుల నుంచి కచ్చితమైన ఆదేశాలు ఉన్నాయి. ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారాన్ని ఇవ్వాలని అవగాహన కల్పిస్తున్నాం. అయినా కొందరు నిర్లక్ష్యం, మరి కొందరు పని భారంతో సమాచారం ఇవ్వక పోవడంతో ఇలా చోరీలకు ఆస్కారం లభిస్తుంది. ఈక్రమంలో ప్రజల్లో అవగాహన కలిగినప్పుడే నేరాల నియంత్రణ సాధ్యం. అజాగ్రత్తగా వ్యవహరిస్తే నేరాలు ఆగవు. వీధుల్లో ఉంటున్నవారు అవసరమైతే నేర నియంత్రణకు కలసి కట్టుగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి.

దాబాలలో మద్యం అమ్మితే కఠిన చర్యలు

అద్దంకి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : నామ్ రోడ్డు వెంబడి ఉన్న దాబాలలో మద్యం అమ్మకాలు జరిగితే కఠిన చర్యలు తప్పవని సీఐ సుబ్బరాజు అన్నారు. శుక్రవారం సీఐ సుబ్బరాజు అద్దంకి పట్టణం సమీపంలో నామ్ రోడ్డు వెంబడి ఉన్న డాబా లను తనిఖీ చేశారు. మద్యం అమ్మకాలు జరిగినా, డ్రైవర్‌లు మద్యం సేవించినట్లు తెలిసినా దాబాల నిర్వహకులే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. అదే సమయంలో లారీలను రోడ్డు మార్జిన్‌లో ఆపకుండా దాబాల పక్కన ఉండే ఖాళీ స్థలాలలో నిలుపుకునేలా చూడాలన్నారు. లారీలు పార్కింగ్ చేసి న సమయంలో చోరీలు జరగకుండా అన్ని దాబాల వద్ద కాపలా వ్యక్తులను ఏర్పాటు చేసుకోవాలని సీఐ సూచించారు.

పమిడిపాడు మేజర్‌లో మహిళ మృతదేహం

పంగులూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముప్పవరం గ్రామ సమీపంలోని ఎన్నెస్పీ కెనాల్‌లో శుక్రవారం రాత్రి మహిళ మృదేహం గుర్తించారు. కాలువలో శవమై కనిపించిన మహిళ మార్టూరు మండలం కోనంకి గ్రామానికి చెందిన బిట్రా అన్నపూర్ణ (55)గా గుర్తించారు. కోనంకి గ్రామానికి చెందిన బిట్రా వెంకటకోటేశ్వరరావు భార్య అన్నపూర్ణ గురువారం మార్టూరు మండలం వరపర్లలోని బంధువుల ఇంటికి వెళి తిరిగి వస్తూ ఇంటికి చేరుకోలేదు. అన్నపూర్ణ మృతదేహం కాలువలో కనిపించిందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. విషయానిన కుటుంబ సభ్యులకు తెలిపినట్లు ఎస్ఐ వినోద్‌బాబు తెలిపారు.

శిథిలావస్థలో అద్దంకి ఆర్టీసీ బస్టాండ్

- తరచూ మరమ్మతులు.. అయినా ఊడిపడుతున్న శ్లాబ్ పెచ్చులు
- కొత్త బస్టాండ్ నిర్మాణం కోసం ఎదురు చూపులు
- మంత్రి గొట్టిపాటి ప్రత్యేక దృష్టి సారించాలని ప్రయాణికుల వేడుకోలు



శ్లాబ్‌కు గతంలో చేసిన మరమ్మతులు, పక్కడ ఊడిన శ్లాబ్ పెచ్చులు



ఊడిపడ్డ శ్లాబ్ పెచ్చులు

అద్దంకి, మార్చి28(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో 4 దశాబ్దాల క్రితం నిర్మాణం చేసిన ఆర్టీసీ బస్టాండ్ పూర్తిగా శిధిలావస్థ కు చేరింది. తరచూ మరమ్మతులు చేస్తున్నా శ్లాబ్ పెచ్చులు ఊడి పడుతునే ఉన్నాయి. దీంతో ఈ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయం గుప్పిట్లో వేచి ఉండాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. అద్దంకి పట్టణంలో 4 దశాబ్దాల క్రితం ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం జరిగింది. మూడు దశాబ్దాల కాలం ఎలాంటి మరమ్మతులు లేకుండానే ఉన్నప్పటికి గత దశాబ్ద కాలం గా తరచూ మరమ్మతులకు గురవుతుంది. శ్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. పలు సందర్భాలలో ప్రయాణికులు తృటిలో ప్రమాదాల నుండి తప్పించుకున్నారు. శ్లాబ్ కు పెచ్చులు ఊడిన చోట ప్యాచ్ వర్క్‌లు చేసినా వెంటనే పక్కనే మరో చోట ఊడి పడుతున్నాయి. దీంతో శ్లాబ్ మొత్తం ప్యాచ్ లతో నిండి ఉంది. గురువారం మరో సారి శ్లాబ్ పెచ్చులు ఊడిపడ్డాయి. దీంతో మరలా తాత్కాలిక మరమ్మతులు ప్రారంభించారు. 4 దశాబ్దాలు దాటినందున కొత్త బస్టాండ్ నిర్మాణం చేపట్టే దిశగా ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రస్తుతం గొట్టిపాటి రవికుమార్ విద్యుత్‌శాఖ మంత్రి గా ఉన్నందున భవిష్యత్ అవసరాలను కూడా దృష్టి లో ఉంచుకొని ఎక్కువ ప్లాట్ ఫారమ్ లతో అన్ని హంగులతో కొత్త బస్టాండ్ నిర్మాణం చేపడితే మరో ఐదారు దశాబ్దాల పాటు ఎలాంటి ఇబ్బంది ఉండకుండా ఉంటుందనే అభి ప్రాయం పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్ శిధిలావస్థ కు చేరి పెచ్చులు ఊడిపడుతున్న విషయాన్ని డిపో మేనేజర్ రామ్మోహనరావు దృష్టి కి తీసుకు పోగా కొత్త బస్టాండ్ నిర్మాణం కు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

ఉన్నత పాఠశాలకు నోచుకోని కారంచేడు

- రూ.కోట్ల విలువ చేసే భూములు భవనాలను అప్పగించినా పట్టించుకోని అధికారులు



యార్లగడ్డ నాయడమ్మ ఓరియంటల్ ఉన్నత పాఠశాల (ఫైల్)

కారంచేడు (పర్చూరు), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో కోట్ల విలువ చేసే భూములు, భవనాలు అప్పగించినా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉన్నత పాఠశాలకు నోచుకోలేదని కారంచేడు గ్రామస్థులు వాపోతున్నారు. రాష్ట్రంలోనే సినీ ప్రముఖులు, రాజకీయ ఉద్దండులకు నిలయంగా ఉన్న కారంచేడులో విద్యాశాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో ఉన్నత పాఠశాలకు నోచుకోని స్థితి ఏర్పడింది. గ్రామానికి చెందిన యార్లగడ్డ వెంకన్న చౌదరి, యార్లగడ్డ రంగనాయకులు 1956లో యార్లగడ్డ నాయడమ్మ ఎయిడెడ్ పాఠశాల పేరుతో చల్లపల్లి రాజాగారి చేతుల మీదుగా పాఠశాలను ప్రారంభించారు. 1963లో ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు నూతన భవనాలను ప్రారంభించారు. అప్పటి నుంచి వేలాది మంది ఇక్కడ విద్యను అభ్యసించారు. అవిభక్త కలవలల శస్త్ర చికిత్సకు పేరుపొందిన నాయుడమ్మతోపాటు, మంత్రిగా పనిచేయడమే కాక లోక్ సభ, రాజ్యసభలో ప్రాతినిధ్యం వహించిన డాక్టర్ దగ్గుబాటికి విద్యాబుద్ధులు నేర్పింది ఈపాఠశాలే. ఎందరో విద్యార్థులను ఉన్నత శిఖరానికి చేర్చిన ఈపాఠశాల పరిస్థితి నేడు దయనీయంగా మారింది. 2022లో గత వైసీపీ తెచ్చిన నూతన విధానానికి అనుగుణంగా పాఠశాల కరస్పాండెంట్ రఘుబాబు ఇతర కమిటీ సభ్యులు కోట్లాది రూపాయల విలువచేసే ఎకరం భూమిలో నిర్మించిన 12 గదుల భవనాన్ని ప్రభుత్వానికి స్వాధీనపరిచారు. నిబంధనల మేరకు ప్రభుత్వం పాఠశాల నిర్వహించాల్సి ఉండగా యూడైస్ కోడ్‌ను పిల్లలు లేరన్న నెపంతో రద్దు చేశారని కమిటీ ప్రతినిధులు చెప్తున్నారు. తిరిగి పాఠశాలను ప్రారంభించడానికి కరస్పాండెంట్ రఘుబాబు ప్రస్తుత పాఠశాల కమిషనర్ దృష్టికి తీసుకుపోయిన క్రమంలో కింది స్థాయి అధికారులకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించినా ఫలితం లేదని ప్రజలు అంటున్నారు. చీరాల ఉపవిద్యాశాకాధికారితోపాటు, కారంచేడు ఎంఈవోకు పాఠశాలను పూర్తిస్థాయిలో అప్పగించిన ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఉన్నత పాఠశాల సేవలకు కారంచేడు విద్యార్థులు దూరంకాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సీఐకి ప్రశంసాపత్రం

అద్దంకి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన లోక్ అదాలత్‌లో అద్దంకి పోలీస్ స్టేషన్‌కు చెందిన 33 కేసులు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేసిన అద్దంకి టౌన్ సీఐ సుబ్బరాజును ఎస్పీ తుషార్ డూడీ శుక్రవారం అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఇటీవల జరిగిన లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కామైన పోలీస్ స్టేషన్ లలో అద్దంకి స్టేషన్ ద్వితీయ స్థానంలో నిలవడంతో సీఐ సుబ్బరాజును శు క్రవారం బాపట్లలో జరిగిన సమావేశం అనంతరం సీఐకి ప్రశంసాప త్రంతో ఎస్పీ అభినందించారు.



ఎస్పీ డూడీ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న సీఐ సుబ్బరాజు



వీర్లకొండ వద్ద ఎస్ ఆర్ గ్రానైట్ క్వారీని తనిఖీ చేస్తున్న డీడీఎంఎస్ జ్ఞానేశ్వర్

క్వారీల్లో భద్రత చర్యలు పటిష్టంగా అమలు చేయాలి

బల్లికురవ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : గ్రానైట్ క్వారీలలో పనుల వద్ద భద్రత చర్యలు పటిష్టంగా అమలు చేయాలని మైన్స్ అండ్ సేఫ్టీ డిప్యూటీ డెరెక్టర్ (డీడీఎంఎస్) జ్ఞానేశ్వర్ కోరారు. శనివారం మండల పరిధిలోని వీర్లకొండ వద్ద గత ఎస్ఆర్, కిషోర్, హనుమాన్ ఎక్స్‌పోర్ట్సు గ్రానైట్ క్వారీలను డీడీఎంస్ తనిఖీలు చేశారు. ఈసందర్భంగా క్వారీలలో జరుగుతున్న పనుల వివరాలను పరిశీలించారు. ఎంత మంది సిబ్బంది పనులలో ఉన్నారు. మేనేజర్లు ఉన్నారా బౌండ్రీ ప్రకారం పనులు చేస్తున్నారా పరిశీలించారు. పనుల వద్ద నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. అలానే ప్రమాదాలు జరగకుండా ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకొని ముందుకు వెళ్లాలన్నారు. ఈ తనిఖీలో సేఫ్టీ సిబ్బంది సుబాస్కర్‌రెడ్డి, క్వారీల మేనేజర్లు నాగేశ్వరాబాబు, కాంతరాజు, మాలపాటి పోతురాజు పాల్గొన్నారు.

నేడు టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

మార్టూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం మార్టూరు పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు, పట్టణాధ్యక్షుడు కామినేని జనార్దన్, రాష్ట్ర నాయకులు షేక్ అబ్దుల్ రజాక్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు, బూత్ కన్వీనర్లు, కన్వీనర్లు తరలిరావాలని కోరారు.

రైతుల సేవే మన గ్రోమోర్ లక్ష్యం

గుంటుపల్లిలో మినరల్ ఆర్వో ప్లాంటు ప్రారంభం



గుంటుపల్లిలో మినరల్ ఆర్వోప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మన గ్రోమోర్ జోనల్ మేనేజర్ సురేష్

బల్లికురవ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సేవలు అందించడమే మన గ్రోమోర్ లక్ష్యమని ఆ శాఖ జోనల్ మేనేజర్ సురేష్ పేర్కొన్నారు. మండలంలోని గుంటుపల్లి గ్రామంలో కోరమండల్ కంపెనీ, బల్లికురవ మన గ్రోమోర్ కేంద్రం సహకారంతో రూ.3 లక్షలు వెచ్చించి రైతులకు మినరల్ ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా జోనల్ మేనేజర్ మాట్లాడుతూ తమ సంస్థ ఏటా ఒక్కో గ్రామంలో రైతులకు ప్రజలకు ఉపయోగ పడే సేవా కార్యక్రమాలను చేస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాదాల శ్రీమన్నారాయణ, గ్రోమోర్ మేనేజర్లు మణికంఠ, రాజేష్, చెన్నాచారి, అనీల్, రైతులు పాల్గొన్నారు.

ఖోఖో క్రీడా పోటీలో ప్రతిభచాటిన సర్వేయర్

రవిబాబును సత్కరించిన తహసీల్దార్ సింగారావు

పంగులూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : దేశ స్థాయిలో సెంట్రల్ సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలలో సత్తా చాటిన ముప్పవరం సచివాలయ సర్వేయర్ పి.రవిబాబును తహసీల్దార్ పి.సింగారావు సత్కరించారు. సెంట్రల్ సివిల్ సర్వీసెస్ కల్చరల్ అండ్ స్పోర్ట్స్ బోర్డ్ దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించిన ఖోఖో క్రీడా పోటీలలో రాష్ట్ర జట్టులో పాల్గొని క్రీడా నైపుణ్యం చాటి జట్టు బ్రాంజ్ మెడల్ సాధనలో తోడ్పడ్డారు. విద్యార్థి దశలోనే ఖోఖోలో జాతీయ క్రీడాకారుడిగా రాణించి ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ ఖోఖో పురుషుల జట్టుకు ఎంపికై ప్రతిభ చాటిన రవిబాబును మండల సర్వేయర్ సురేష్, సీనియర్ సహాయకులు శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది అభినందించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలో ప్రతిభచాటిన గ్రామ సర్వేయర్ రవిబాబును సత్కరిస్తున్న తహసీల్దార్ సింగారావు



గుండ్లకమ్మ నదిలో ఊటబావులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్ర

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు

మున్సిపల్ కమిషనర్ రవీంద్ర

అద్దంకి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో అద్దంకి పట్టణ ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. అద్దంకి పట్టణ ప్రజలకు తాగునీటిని అందించేందకు గుండ్లకమ్మ నదిలో ఊటబావుల నుంచి మూడు ఓవర్ హెడ్ ట్యాంక్‌లకు పంపింగ్ చేసి విడుదల చేస్తున్నారు. రామ్‌నగర్, కాకానిపాలెం ట్యాంక్‌లకు నీటిని గుండ్లకమ్మ నదిలో సామాజికవనం (సోషల్ ఫారెస్ట్) సమీపంలో ఉన్న ఊటబావుల నుంచి పంపింగ్ జరుగుతుంది. అయితే వేసవిలో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉండడంతో మండలంలోని నాగులపాడు కు నీటి సరఫరా జరిగి ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఊటబావిని కూడా వినియోగంలోకి తీసుకొచ్చి రామ్‌నగర్ ట్యాంక్‌కు పంపింగ్ చేస్తున్నారు. అదే సమయంలో ధేనువకొండ పునరావాసకాలనీకి చెందిన ఊటబావి కూడా ఖాళీగా ఉండడంతో కాకానిపాలెం ట్యాంక్‌కు నీటిని పంపింగ్ చేసే విధంగా మోటార్ ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకు వచ్చినట్లు కమిషనర్ రవీంద్ర తెలిపారు.

పేద బాలికలకు పౌష్టికాహారం పంపిణీ



బాలికలకు ఆహార కిట్లను అందజేస్తున్న వెంకటమోహనరావు

మార్టూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ పండుగ సందర్భంగా శుక్రవారం వందమంది నిరుపేదలైన బాలికలకు స్థానిక ఎఫర్ట్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాష్టి వెంకటమోహనరావు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఆరెంజ్ ఎలిఫ్యాంట్ అనే అమెరికా సంస్థ ఆర్థిక సహకారంతో 15 రకాలతో కూడిన పౌష్టికాహార కిట్లను బాలికలకు మోహనరావు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ మంచి పౌషకాహారం తీసుకున్నప్పుడే బాలికలు శారీరకంగా, ఆరోగ్యంగా చదువు కోగలరని తెలిపారు. కార్యక్రమంలో శ్రీకారం సంస్థ కార్యదర్శి జాష్టి అనూరాధ, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు హఫీజా, రోటరీ క్లబ్ అధ్యక్షుడు కోటేశ్వరరావు, ఈశ్వరప్రసాద్, షేక్ కాజాహుస్సేన్,మాదాల సాంబశివరావు పాల్గొన్నారు.

అభివృద్ధికే బడ్జెట్‌లో ప్రాధాన్యం

- క్రిటికల్ కేర్‌కు కృషి చేసిన ఎమ్మెల్యే కొండయ్యను ఘనంగా సన్మానించిన పాలకవర్గం, అధికారులు
- ప్రశాంతంగా ముగిసిన మునిసిపల్ బడ్జెట్ సమావేశం



బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్యే కొండయ్యను గజమాలతో సత్కరిస్తున్న మునిసిపల్ చైర్మన్, అధికారులు, కౌన్సిలర్‌లు

చీరాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ బడ్జెట్ కౌన్సిల్ సమావేశం ప్రశాతంగా ముగిసింది. 2025-26కు సంబంధించి జరిపిన బడ్జెట్ కేటాయింపుల్లో అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారు. మొత్తం నిధులు రూ62.64కోట్లు ప్రవేశపెట్టగా, అందులో అభివృద్ధి పనులకు సంబంధించి రూ.39కోట్లు, సాధారణ ఖర్చులు (ఇంధనం, జీతాలు, వగైరా ఖర్చులు) రూ.22 కోట్లకు కేటాయింపులు జరిపారు. అలాగే మిగులు బడ్జెట్ రూ.60.52లక్షలు ఉంటుందని అధికారులు వివరించారు. అయితే కేటాయింపుల్లో ఒకటి రెండు అంశాలపై స్వల్పంగా చర్చలు జరిగినప్పటికీ మిగతా అంశాలపై ప్రశాంతంగా ముగిసింది. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే కొండయ్య ఏరియా ఆసుపత్రికి క్రిటికల్ కేర్‌ను తీసుకురావడంపై సభ్యులంతా హర్షం వ్యక్తం చేశారు. సమావేశం ముగిశాక గజమాలతో ఆయన్ని ఘనంగా సన్మానించారు.

భేషజాలు లేవు..అభివృద్ధికి సహకరించండి - ఎమ్మెల్యే కొండయ్య

సభా సమయంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను పార్టీలకు, ఇతర అనవసరమైన అంశాలకు ప్రాధాన్యమివ్వనని స్పష్టంగా చెప్పారు. నమ్మి ప్రజలు తనను గెలిపించాలరని, ఎటువంటి వివాదాలకు తావు లేకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో అభివృద్ధికి కలిసి కట్టుగా పని చేద్దామని, అందుకు అందరూ సహకరించాలని కోరారు. టీడీపీ కూటమి పూర్తిగా అభివృద్ధిపైనే దృష్టి సారించిందని ప్రకటించగా హర్షధ్వానాలతో సభా ప్రాంగణం మారుమోగింది.

గిన్నిస్ బుక్‌లో మెప్మా మొదటి స్థానం సాధించడంపై అభినందనలు

ఇటీవల మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన మూడు రకాల కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్న మెప్మా విభాగం గిన్నిస్ బుక్ రికార్డు సాధించడంపై ఎమ్మెల్యే కొండయ్య మెప్మా విభాగం ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు. ఒకేరోజు 10 వేల మంది ఎస్ఎంఎస్ శిక్షణలో పాల్గొని, పరీక్షకు హాజరుకావడం, అలాగే రాష్ట్ర వ్యాప్తంగా మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన మార్ట్‌లో చీరాల నుంచి అత్యధికంగా కొనుగోలు చేయడం,అధిక సంఖ్యలో పొదుపు మహిళా సంఘాలు ఇక్కడే ఉండడంపై చీరాల మెప్మా విభాగం గిన్నీస్ బుక్‌లో రికార్డు సాధించిందని వివరించారు. ఎమ్మెల్యే కొండయ్య చీరాల మెప్మా విభాగం సీఏఎం కొండయ్య, ఆర్పీలు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మునిసిల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, కమిషనర్ అబ్దుల్ రషీద్, డీఈ రఘురాం, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీల భారం తొలగించాలి

చీరాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులపై ట్రూ అప్ చార్జీల భారం తగ్గించాలని పలువురు సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. జగన్‌రెడ్డి పాలనలో విద్యుత్ బిల్లుల భారంతో వినియోగదారులు అల్లాడిపోయారని, కూటమి ప్రభుత్వం విద్యుత్ భారాలు పడకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్.బాబూరావు, వసంతరావు, జయరాజు, సత్యమూర్తి, ప్రసాద్, సాంబయ్య పాల్గొన్నారు.

నేడు అద్దంకి మున్సిపల్ సమావేశం

అద్దంకి, మార్చి28(ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపల్ సాధారణ సమావేశం శనివారం మధ్యాహ్నం 12 గంటలకు చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరుగుతుందని కమీషనర్ రవీంద్ర తెలిపారు. మొత్తం 20 అంశాలతో అజెండా రూపొందించారు.

నక్కబొక్కలపాడులో చోరీ

బల్లికురవ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నక్కబొక్కలపాడులో పొలం పనులకు వెళ్లిన సమయాన్ని గుర్తించి ఇంట్లో ఉన్న బీరువాను పగులగొట్టి చోరీ చేసిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. అందిన సమాచారం మేరకు నక్కబొక్కలపాడు గ్రామానికి చెందిన ఆలకుంట లక్ష్మీతిరుపతమ్మ కూలి పనులకు శుక్రవారం వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి బీరువా పగులగొట్టి అందులోని రూ.50వేల నగదు, ఒకటిన్నర సవర్ల బంగారు వస్తువు చోరీకి గురైనట్లు గుర్తించింది. వెంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మండల పరిషత్‌లో మూలుగుతున్న నిధులు

- గ్రామాల్లో జరగని అభివృద్ధి పనులు
- పాత బకాయిలు చెల్లిస్తారా, కొత్త పనులకు ఆమోదముద్ర వేస్తారా
- నేడు సర్వసభ్య సమావేశం



వైదనలో కల్వర్టులు లేక నడవలేని స్థితిలో ఉన్న సీసీ రోడ్డు

బల్లికురవ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మూడు నెలలోసారి గ్రామాలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సర్వ సభ్య సమావేశం సర్వ సాధారణంగా జరుగుతుంది. ఎన్ని సమావేశాలు జరిగిన అభివృద్ధి పనులకు నిధులు కేటాయింపులు లేకుండానే సాదాసీదాగా నిర్వహించి మమ అనిపిస్తున్నారు. శనివారం జరిగే సమావేశంలో అయినా అభివృద్ధి పనులకు నిధులు కేటాయింపులు ఉంటాయా లేదా అని ప్రజలు ఎదురు చూపులు చూస్తున్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఖాతాలో సీనరేజీ నిధులు సుమారు రూ.1.50కోట్ల నిధులు జమ అయి ఉన్నాయి. ఈ నిధులను అభివృద్ధి పనులకు కేటాయించాల్సి ఉంది. కానీ కొన్ని నెలలుగా నిధులు అలానే ఉన్నాయి. గతంలో వైసీసీ నేతలు కొందరు ఎన్నికల సమయంలో హడావుడిగా మట్టి రోడ్లు వేశారు. వారిక కొంత బిల్లులు చెల్లింపులు చేయాల్సి ఉంది. పాత బకాయిలకు తోడు కొత్త పనులకు అమోదముద్ర వేస్తే బాగుంటుందని ప్రజలు అంటున్నారు. చాలా గ్రామాలలో అభివృద్ధి అటకెక్కి ఉంది. గ్రామాలలో మురికి కాలవలు నిర్మాణాలు లేక రోడ్లపై మురుగు పారుతోంది. అలానే ప్రభుత్వ కార్యాలయల వద్ద పబ్లిక్ టాయిలెట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలలో 90 శాతం పూర్తి అయిన ప్రభుత్వ భవనాలు పనులు నిలిచి ఉన్నాయి. వీటికి కొంత నిధులు కేటాయిస్తే అవి వినియెగంలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో మండల పరిషత్ నిధులను గ్రామాల అభివృద్ధికి కేటాయించే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.